
ఆంధ్రజ్యోతి 5 ప్రకాశం
ఆదివారం 13, జూలై 2025




పొదుపు మహిళల పేరుతో నకిలీ సంఘాలు సృష్టించి కోట్లు దండుకుంటున్న ఆర్పీల అవినీతిపై ఆ సంస్థ ఎండీ సీరియస్ అయ్యారు. అక్రమాలపై పూర్తి నివేదిక ఇవ్వాలని పీడీ శ్రీహరిని ఆదేశించారు. ఈ పరిణామాల నేపథ్యంలో అసలు మెప్మాలో ఏం జరుగుతుందోననే చర్చ జిల్లా అంతటా మొదలైంది. కొందరు ఆర్పీల అక్రమాలు వెలుగులోకి రావడంతో బాధిత పొదుపు మహిళలు సైతం ఇప్పుడిప్పుడే బయటకొచ్చి అన్యాయాలను వివరిస్తున్నారు. రెండు నెలల క్రితం ఒంగోలు నగర పరిధి కేశవస్వామిపేటలో ఉండే యానాదులను మోసం చేసిన ఓ ఆర్పీ భారీగానే దండుకుంది. దీనిపై రచ్చకావడంతో తాను తీసుకున్న సొమ్ము చెల్లిస్తానంటూ సభ్యులకు సర్దిచెప్పుకుంది. నేటికీ ఎలాంటి చెల్లింపులు చేయకపోవడం, మరోవైపు అధికారులు సైతం చర్యలు తీసుకోకపోవడంతో అదేబాటలో మరి కొందరు బోగస్ గ్రూపుల ఏర్పాటులో ఉన్నారు. తాజాగా పేర్నమిట్ట ఆర్పీపై వచ్చిన ఆరోపణలతో బోగస్ గ్రూపుల వ్యవహారాలు బయటకు వస్తున్నాయి. ఇప్పటికే ఈ బాగోతంలో కీలకపాత్ర వహించిన వారిని తప్పించగా, మరికొందరి పాత్రపై విచారణ సాగుతోంది.

మెప్మాలో అవినీతిపై కదలిక...!

అవినీతి ఆరోపణలు వస్తే ఇంటికే..

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో ఆర్పీల అవినీతి వ్యవహారం, నకిలీ గ్రూపులపై పీడీ శ్రీహరి విచారణకు సిద్ధమయ్యారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు, అవినీతికి పాల్పడిన ఆర్పీల జాబితాను సిద్ధం చేస్తున్నారు. పొదుపు సంఘాల సభ్యులను మోసం చేస్తూ, బ్యాంకులను బురిడీ కొట్టిస్తూ కోట్లు దోచుకుంటున్న వారిపై కఠిన చర్యలకు సిద్ధమయ్యారు. బోగస్ పేరుతో దోచుకున్న సొమ్మును రికవరీ చేసేలా ప్రణాళిక రూపొందించారు. దీంతో వారిలో ఆందోళన మొదలవ్వగా, మరి కొందరు ఆర్పీలు తమపైకి వస్తే అందులో భాగస్వాములైన వారిని బయటకు లాగుతామంటూ బెదిరిస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉంచితే, కేశవస్వామిపేటకు చెందిన యానాది సామాజికవర్గానికి చెంది పలు పొదుపు సంఘాల సభ్యులను మోసం చేసిన ఆర్పీపై చర్యలు లేకపోవడం, తాజాగా పేర్నమిట్టకు చెందిన ఆర్పీ బాధిత పొదుపు సంఘాల పట్ల ఇదే తీరుతో మాట్లాడటం విస్మయం కలిగిస్తుంది. ఇప్పటికైనా మెప్మాలో అవినీతికి అడ్డుకట్ట వేస్తారా? ఆ ఆర్పీలపై చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.



1 మెప్మాలో 'బోగస్ బాగోతం'పై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు

గత వైసీపీ పాలనలో ఇబ్బడిముబ్బడిగా బోగస్ గ్రూపులు సృష్టించి సుమారు రూ.40 కోట్ల మేర దోచుకోగా, ఈ ఏడాది జనవరి నుంచి కూడా ఆ వ్యవహారం మళ్లీ మొదలైంది. ఇదిలా ఉంచితే మూడు నెలల క్రితం యానాది సామాజికవర్గం సభ్యులు ఆర్పీ తమను మోసం చేసిందంటూ రోడ్డెక్కగా.. తాజాగా పేర్నమిట్టకు చెందిన ఆర్పీ, దామచర్ల జనార్దన్ కాలనీకి చెందిన పొదుపు మహిళలు బయటకొచ్చారు. తమను మోసం చేసి, వారి పేరుతో నకిలీ గ్రూపులు తయారు చేసి రుణాలు తీసుకుందని విమర్శించారు. దీనిపై ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. ఈ వ్యవహారం ఇటు కార్యాలయ ఉద్యోగుల్లోనే కాకుండా, అటు మెప్మా కేంద్ర కార్యాలయంలోనూ చర్చనీయాంశంగా మారింది. అసలు అక్కడ ఏమి జరుగుతోంది.. అధికారులు ఏమి చేస్తున్నారు.. అనే విషయాలను ఆరా తీస్తుంది. రాష్ట్రప్రభుత్వం ఇంటికో మహిళను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు పలు పథకాలు అమలు చేస్తోంది. ఈ వాహనం, తృప్తి క్యాంటీన్, వీధి వ్యాపారాలకు ప్రోత్సాహం, హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్, ఆహార తయారీ, రిటైల్ దుకాణాలు, డీజీ లక్ష్మి పథకంతో సేవా రంగాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ పథకాలు ప్రతి పొదుపు మహిళకు చేరువ చేయాల్సి ఉందని, కానీ ఆ పథకాల పురోగతి మరిచి, ఆర్పీలు అవినీతికి పాల్పడటంపై శనివారం ఎండీ తేజభరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బోగస్ గ్రూపులపై సమగ్ర విచారణ చేయాలని పీడీని ఆదేశించారు. అలాంటి వారిని నిర్మొహమాటంగా తొలగించి, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

1 అవినీతి వ్యవహారాలపై ఎండీ తేజ్‌భరత్ సీరియస్ 1 వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీకి ఆదేశం

1 ఇకపై బోగస్ పొదుపు గ్రూపులు ఏర్పాటు చేసే వారికి చుక్కలే

1 గత అక్రమాలపై చర్యలు లేకపోవడమే కారణమా!



ఒంగోలు, కార్పొరేషన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం పొదుపు సంఘాలను బలోపేతం చేసేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తోంది. వారి కోసం పలు పథకాలను అమలుచేస్తూ వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతుంటే.. ఒంగోలు మెప్మాలో మాత్రం అందుకు విరుద్ధంగా జరుగుతోంది. అక్కడ రోజుకో అవినీతి భాగోతం వెలుగులోకి వస్తోంది. వరుస పరిణామాల క్రమంలో మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ తేజ్ భరత్ సీరియస్ అయ్యారు. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'మెప్మాలో మళ్లీ బోగస్ రచ్చ' కథనంపై ఆయన జిల్లా అధికారి పీడీ శ్రీహరితో మాట్లాడారు. ఆర్పీల అవినీతి వ్యవహారాలపై నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. గత ఏడాది నుంచి మెప్మాలో ఆర్పీల అవినీతిపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురిస్తుంది. పొదుపు సభ్యుల ఆధార్ కార్డులను ఆన్‌లైన్‌లో మరోసారి సీడింగ్ చేసి, వారి పేరుతో నకిలీ పొదుపు గ్రూపుల తయారు చేయడాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది.



లక్షిత్ కుటుంబసభ్యుల నుంచి వాంగ్మూలం తీసుకుంటున్న పీడీ సువర్ణ

మిస్టరీగా బాలుడి మృతి

లక్షిత్ మరణంలో ఎవరి పాత్ర ఎంత ?

అంగన్‌వాడీ టీచర్‌కు, ఆయాకు పీడీ షోకాజ్ నోటీసు

పోస్టుమార్టం రిపోర్ట్ కోసం ఎదురుచూపులు

కంభం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కంభం మండలం లింగోజీపల్లిలో లక్షిత్ అనుమానాస్పద మృతి మిస్టరీగా మారింది. ఈ కేసులో ప్రతి ఉదంతమూ అంతుచిక్కడం లేదు. ఈనెల 8వ తేదీ లింగోజీపల్లిలో అంగన్‌వాడీ స్కూల్ నుంచి బయటకు వచ్చిన లక్షిత్‌ను ఎవరైనా కిడ్నాప్ చేశారా? ఆ తరువాత బాలుడిని ఊరు దాటించి తీసుకెళ్లడం కుదరక 3 రోజులుగా ఆహారం, నీరు లేక పూర్తిగా నీరసించి డీహైడ్రేషన్‌కు గురయ్యాక గురువారం తెల్లవారుజామున పొలాల్లో పడవేసివెళ్లారా? అన్నది తేలాల్సిఉంది. అక్కడ పడేయడం వల్లే బాలుడు మరణించాడా, అన్నది అంతుచిక్కని మిస్టరీగా మారింది. కిడ్నాపర్లు అలా చేసినా అది బాలుడి దారుణ హత్య కిందకే పరిగణించాల్సి వస్తుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేడన్న సామెతగా లక్షిత్‌ను సన్నిహితులు లేక లక్షిత్ కుటుంబ సభ్యులు అంటే పడనివారు ఎత్తుకెళ్లి ఉంటారని అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. మొదటినుంచి సీఐ మల్లికార్జున, ఎస్సై నరసింహారావు, పోలీసు సిబ్బంది, ప్రజలు రెండు రోజులు గాలించినా దొరకని బాలుడు గురువారం ఉదయం సూరేపల్లి సమీపంలోని వ్యవసాయ పొలంలో విగతజీవిగా పడిఉన్నాడు. ఎవరో పక్కా ప్లాన్‌తో చంపేసి ఉంటారని అనుమానిస్తున్నారు. బాలుడు ఇంత దీనస్థితిలో మరణించడానికి కారణమైన వారెవరైనా సరే విడిచిపెట్టకూడదని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. పోస్టుమార్టం రిపోర్టుతో అన్ని విషయాలు బయటకు వస్తాయని పోలీసులు చెప్పుండడంపై అందరూ ఎదురు చూస్తున్నారు.

లింగోజీపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఉంటున్న చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాల్సిన అంగన్‌వాడీ టీచర్ గోవిందమ్మ, ఆయా కృష్ణకుమారిలపై జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సువర్ణ షోకాజ్ నోటీసులు ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం పీడీ

లక్షిత్ కుటుంబ సభ్యుల నుంచి వాంగ్మూలం

గ్రామం వచ్చి కేంద్రాన్ని పరిశీలించారు. లక్షిత్ కుటుంబసభ్యుల నుంచి, గ్రామస్థుల నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. అంగన్‌వాడీ టీచర్, ఆయాల నుంచి రాత పూర్వకంగా సంజాయిషీ తీసుకున్నారు.

అక్రమాలకు అడ్డుకట్ట

భూ వివాదాల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి

దొంగ రిజిస్ట్రేషన్ల రద్దుపై కలెక్టర్లకు అధికారం

క్యూఆర్ కోడ్‌తో పాసుపుస్తకాలు ఇచ్చేందుకు ప్రణాళికలు

భవిష్యత్‌లో భూ అక్రమాలు దొర్లకుండా కట్టుదిట్టమైన చర్యలు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : భూ వివాదాలను పరిష్కరించేందుకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందుకు సంబంధించిన సీఎం చంద్రబాబు రెవెన్యూ యంత్రాంగానికి దిశానిర్దేశం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. భూ ఆక్రమణలను అడ్డుకునేందుకు కొత్త రిజిస్ట్రేషన్ చట్టాన్ని అమలుచేసేందుకు శ్రీకారం చుట్టారు. ఈ చట్టప్రకారం ఎవరైనా అక్రమంగా భూములను రిజిస్ట్రేషన్ చేయించుకుంటే అటువంటి వాటిని కలెక్టర్ నేతృత్వంలో కమిటీకి రద్దుచేసే అధికారాన్ని ప్రభుత్వం కట్టబెట్టినట్లు తెలుస్తోంది. కొంతమంది చట్టంలోని లోసుగులను ఆసరా చేసుకొని ఇతరుల భూములను అక్రమంగా రాయించుకుంటూ హక్కుదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆ అక్రమాలపై ప్రభుత్వానికి పెద్దఎత్తున ప్రభుత్వానికి ఫిర్యాదులు వస్తున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన రాష్ట్రస్థాయి రెవెన్యూ సమీక్షా సమావేశంలో కొత్త రిజిస్ట్రేషన్ చట్టంపై దిశా నిర్దేశంచేశారు. తదనుగుణంగా రెవెన్యూ యంత్రాంగం దృష్టిసారించింది.

సాధారణంగా భూములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటే బాధితులు సివిల్ కోర్టును ఆశ్రయించేవారు. దాని వల్ల జాప్యం జరగడటంతోపాటు ఆ భూములు చేతులు కూడా మారిపోయేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా కలెక్టర్ల నేతృత్వంలో ఏర్పడే కమిటీ విచారణ చేసి రద్దు చేస్తుంది. నిరంతరం గ్రీవెన్స్‌సెల్‌లో భూ సంబంధమైన అర్జీలే అధికారులకు ఎక్కువగా వస్తున్నాయి. అటువంటి సమస్యలను పరిష్కరించేందుకు అక్టోబరు 2వ తేదీ డెడ్‌లైన్ పెట్టుకొని ఆ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేయడంతో బాధితులకు మేలు జరగనుంది.



1 ప్రతి భూమికీ సమగ్ర సమాచారం

ప్రస్తుతం ఉన్న పాస్‌పుస్తకాలకు క్యూఆర్ కోడ్ ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. పలురకాల భూములు ఉండటంతో ఆ భూములకు కలర్ పాసుపుస్తకాలు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి భూమికి సంబంధించి సమగ్ర సమాచారం ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. ఆధార్, సర్వే నెంబర్లను అనుసంధానం చేసి భూసమస్యల చిక్కుముళ్లను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఈ కొత్త చట్టం అమలులోకి వస్తే జిల్లాలో భూ సంబంధ సమస్యలతో అల్లాడిపోతున్న సన్న, చిన్నకారు రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.భూముల విలువల పెరిగిపోవడంతో అనేక ప్రాంతాల్లో అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకోవడంతో పాటు, మరికొన్ని ప్రాంతాల్లో ఇతరుల భూములను అక్రమంగా మ్యుటేషన్ చేయించుకొని తమ పేరుతో ఆన్‌లైన్ చేసుకున్నారు. ఇటువంటి సమస్యలన్నింటిని ప్రభుత్వం పరిష్కరించే దిశగా అడుగులు వేస్తోంది.



ఇసుక రీచ్ నిర్వాహకుల దౌర్జన్యం

1 నాలుగు రోజులుగా అన్‌లోడ్ చేయనివ్వలేదని లారీ డ్రైవర్ ఫిర్యాదు

1 ఇన్‌చార్జి కలెక్టర్ ఆదేశంతో మైనింగ్ శాఖ అధికారుల పరిశీలన

1 ఎట్టకేలకు లబ్ధిదారుడి చెంతకు ఇసుక

7

ఇష్టారాజ్యానికి చెక్


1 ఎయిడెడ్ పాఠశాలల్లో టీచర్ల నియామకాలకు తాజాగా మార్గదర్శకాలు విడుదల

1 80 మార్కులకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష

1 ఇంటర్వ్యూలు రద్దు, టెట్‌కు 20 శాతం వెయిటేజీ

ఒంగోలు విద్య, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎయిడెడ్ విద్యా సంస్థల్లో బోధన, బోధనేతర పోస్టుల భర్తీకి ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను జారీచేసింది. ఆ పోస్టుల్లో మెరిట్ అభ్యర్థులను ఎంపిక చేసేందుకు కొత్త నిబంధనలను రూపొందించింది. గతంలో సాగిన ఇష్టారాజ్యాన్ని అడ్డుకునేందుకు ఇంటర్వ్యూలను రద్దుచేసింది. 80 మార్కులకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ) నిర్వహిస్తారు. మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేస్తారు. ఈ మేరకు పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రైవేటు యాజమాన్యాలు పాఠశాలల ఏర్పాటు, ప్రభుత్వ గుర్తింపు, పరిపాలన, నియంత్రణకు సంబంధించి ప్రభుత్వం గతంలో జారీచేసిన ఉత్తర్వులను సవరిస్తూ కొత్తగా ప్రైవేటు ఎయిడెడ్, నాన్ మైనార్టీ పాఠశాలల్లో పోస్టుల భర్తీ విషయంలో కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. పోస్టుల భర్తీ స్టాఫ్ సెలెక్షన్ కమిటీ ద్వారా జరుగుతుంది. ఈ కమిటీలో ఎడ్యుకేషనల్ ఏజెన్సీ ప్రెసిడెన్స్ లేదా ఆయన ప్రతినిధి, హెచ్ఎం, ఇద్దరు సబ్జెక్టు నిపుణులను విద్యాశాఖకు సంబంధించిన ఉప విద్యాధికారి స్థాయి అధికారితో కూడిన స్టాఫ్ సెలక్షన్ కమిటీ పోస్టులకు అర్హులను ఎంపిక చేస్తుంది. జిల్లాలో ఎక్కువగా సర్క్యులేషన్ ఉన్న రెండు పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలి. పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించరాదు. 100 మార్కుల్లో 80 మార్కులకు సీబీటీ పరీక్ష, మిగిలిన 20 మార్కులకు ఏపీటెట్/సెట్‌లో సాధించిన మార్కులకు వెయిటేజీ ఇస్తారు. ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న వారికి ఐదు మార్కులు వెయిటేజీ ఇస్తారు. ఎయిడెడ్ పాఠశాల్లో పనిచేస్తున్న వారికి మూడేళ్ల వయో పరిమితి సడలింపు ఉంటుంది.అన్‌ఎయిడెడ్ పోస్టులను కూడా స్టాఫ్ సెలక్షన్ కమిటీ ద్వారానే ఎంపిక చేయాలి. మైనార్టీ విద్యాసంస్థలు ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ద్వారా పోస్టుల భర్తీని ప్రకటించాలి.



నమ్మకం 'చిగురించింది'..!

ఒంగోలు నగర అభివృద్ధిలో భాగంగా చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో తొలగించి, మరో చోటకు మార్చిన రావి చెట్టు రెండు నెలలకే చిగురించింది. సీవీఎన్ రీడింగ్ రూం నుంచి కొణిజేడు బస్టాండ్ వరకు జరుగుతున్న రోడ్ విస్తరణ పనుల్లో భాగంగా మాతా శిశు వైద్యశాలలోని వందేళ్ల నాటి భారీ వృక్షాన్ని అధికారులు తొలగించి, మరోచోట పాతారు. వేళ్లతో సహా పెకిలించి ఆసుపత్రి ఆవరణలోనే దానిని నాటగా, మొక్కలు భారీవృక్షాల తరలింపుల్లో నిపుణులైన హైదరాబాదుకు చెందిన అన్వర్ అనే వ్యక్తి ఆ పనులు చేపట్టినట్లు కమిషనరు వెంకటేశ్వరరావు తెలిపారు. వందేళ్ల నాటి భారీ వృక్షం తిరిగి చిగురిస్తుందా? అనే అనుమానం అప్పట్లో అందరికీ కలిగింది. అధికారుల నమ్మకం నిజమైంది. అందుకే పెద్దలు అంటారు 'వృక్షో రక్షితః రక్షతః' అని, ఆ చెట్టును తొలగించకుండా తిరిగి నాటడం ద్వారా భవిష్యత్‌లో మరెందరికో నీడనిస్తుందన్న అధికారుల నమ్మకం చిగురించింది. భారీ రావిచెట్టు జీవం పోసుకుని తిరిగి చిగురించడం పట్ల కార్పొరేషన్ అధికారులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు

- ఒంగోలు, కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)



మార్పులు, చేర్పులవే అధికం

1 రైస్ కార్డులకు భారీగా దరఖాస్తులు

1 జిల్లా వ్యాప్తంగా అన్ని రకాలు 82,889 అభ్యర్థనలు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 12(ఆంధ్రజ్యోతి) : రైస్ కార్డులలో చేర్పులు, మార్పుల కోసం భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. గత రెండేళ్ల నుంచి కార్డులలో కొత్తగా ఎటువంటి మార్పులు జరగలేదు. దీంతో ప్రజా ప్రభుత్వం మే 7 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఇప్పటివరకు అన్ని రకాల దరఖాస్తులు 82,889 వచ్చాయి. అందులో ప్రస్తుతం ఉన్న కార్డులో పేరు నమోదు కోసం 59,795 దరఖాస్తులు రాగా కొత్త వాటి కోసం 9,483 అందాయి. ప్రస్తుతం ఉన్న రైస్ కార్డుల్లో చిరునామా మార్పు కోసం 2,498 రాగా ఆధార్ నమోదు కోసం 1,105, ఒకషాపు నుంచి మరోచోటకు మార్పుకునేందుకు 8, రైస్ కార్డులో పేరు తొలగింపు కోసం 1,481 దరఖాస్తులు వచ్చాయి. కార్డులను సరెండర్ చేసేందుకు 41 రాగా రైస్‌కార్డు ఒక చోట నుంచి మరో చోటుకు మార్పునకు 8157 దరఖాస్తులు వచ్చాయి. ఇలా జిల్లావ్యాప్తంగా రైస్ కార్డుల్లో చేర్పులు, మార్పుల కోసం అధికారుల వద్దకు భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. అధికారుల వద్దకు ఇప్పటివరకు వచ్చిన వాటి పరిశీలన ప్రక్రియను పూర్తిచేశారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల్లో 51,179ని ఆమోదించగా 11,137 దరఖాస్తులను తిరస్కరించారు. మిగిలినవి పరిశీలించాల్సి ఉంది.

కనిపించని పరిశ్రమల జాడ

ఐదు దశాబ్దాల క్రితం గిద్దలూరులో ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏర్పాటు

స్థలం కొనడం, ఫెన్సింగ్ వేయడంతో సరి

లభించని ఉపాధి అవకాశాలు, పట్టించుకోని ఏపీఐఐసీ అధికారులు

7

మాలకొండను దర్శించుకున్న జిల్లా న్యాయాధికారి


స్వామివారి దర్శనానికి వెళ్తున్న జిల్లా న్యాయాధికారి భారతి

వలేటివారిపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహం స్వామిని శనివారం ఒంగోలు జిల్లా న్యాయాధికారి ఎ.భారతి, జిల్లా ఎస్పీ రవిచంద్ర వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రధాన ఉపఅర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర ప్రత్యేక పూజలు చేశారు. శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం స్వామివారి ప్రసాదం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్, ఎస్ఐ మరిదినాయుడు, టీడీపీ నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, కాకుమాను హర్షకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేర్ని నానిని వెంటనే అరెస్ట్ చేయాలి

కొండపి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్నినాని వైసీపీ విస్తృత సమావేశంలో కార్యకర్తలు రప్పారప్పా అంటూ నరకాలంటూ హత్యలను ప్రోత్సహిస్తూ చేసిన వ్యాఖ్యలను సుమోటోగా హైకోర్టు స్వీకరించి కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీపతి సతీష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ పేర్ని నాని లాంటి వాళ్ల వల్ల యువకులు చెడిపోతున్నారని, యువతను చెడుమార్గం వైపు, నేరప్రవృత్తికి ప్రేరేపిస్తున్న నానిపై తీవ్రమైన కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి భరోసా

● ఎమ్మెల్యే దామచర్ల


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలువురు వివిధ అనారోగ్య కారాణాలతో ఆసుపత్రిలో వైద్యం పొందుతుండగా వారికి ఆర్థిక చేయూత, ఆర్థిక భరోసా ఇచ్చేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు చేశారన్నారు. దీని ద్వారా ప్రతి ఒక్కరు వైద్యం చేయించుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శనివారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో 45 మంది లబ్ధిదారులకు రూ.77.33 లక్షలను చెక్కుల రూపంలో ఎమ్మెల్యే దామచర్ల అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా అంకమ్మతల్లి కొలుపులు


ఎమ్మెల్యే బీఎన్‌ను సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

మద్దిపాడు, జూలై 12(ఆంధ్రజ్యోతి): దొడ్డవరం గ్రామంలో పాలెపు భీమవరపు వారి ఆధ్వర్యంలో అంకమ్మతల్లి కొలుపులు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. దేవాలయం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఆయన చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మందపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడకా స్వాములు, భీమవరపు వెంకటరావు, నాయకులు పాల్గొన్నారు.

రజిత హృదయ లక్ష్మీదేవి విగ్రహాల బహూకరణ



స్వామివారికి హృదయ లక్ష్మీదేవి విగ్రహాలను అందజేస్తున్న భక్తులు

ఒంగోలు(రూరల్), జూలై12(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు గ్రామంలోని శ్రీచెన్నకేశవస్వామి, శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం శ్రీచెన్నకేశవ స్వామివారికి రజిత హృదయ లక్ష్మీదేవి విగ్రహాలను అదే గ్రామానికి చెందని పాటిబండ్ల రాఘవలు, పద్మావతి దంపతులు బహూకరించారు. ఈ సందర్భంగా అర్చకుడు పరాంకుశంసమీర్‌కుమార్‌కు వాటిని అందజేయగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చెన్నకేశవస్వామివారికి విగ్రహాలను అలంకరించారు. అనంతరం తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఘనంగా పోలేరమ్మ కొలుపులు

● ప్రత్యేక పూజలు చేసిన సత్య

జరుగుమల్లి/కొండపి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : జరుగుమల్లి మండలంలోని రామచంద్రాపురంలో పోలేరమ్మ కొలుపులు శనివారం ఘనంగా జరిగాయి. కొలుపుల్లో ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు గోత్రనామార్చనలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి అమ్మవారి నగరోత్సవం, ఆదివారం పాలపొంగళ్లు పెట్టి గ్రామస్థులు మొక్కులు తీర్చుకుంటారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పామూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ అదుపుతప్పి మహిళ మృతి చెందిన ఘటన శనివారం పామూరు వద్ద జాతీయరహదారిపై చోటుచేసుకుంది. ఎస్ఐ టి.కిశోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. సీఎస్‌పురం మండలం కంభంపాడు గ్రామానికి చెందిన మేకల అంజమ్మ(49) కూలీ పనులుకు వెళుతుంది. ఈక్రమంలో పామూరు మండలంలోని తిరగళదిన్నె నుంచి ఇసుక లోడుతో ట్రాక్టర్‌పై పామూరుకు వస్తున్నారు. ఈక్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి సమీపంలోని పొలాల్లోకి దూసుకెళ్లగా అంజమ్మ కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త 12 సంవత్సరాల క్రితమే మృతి చెందాడు. మృతిరాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారులిద్దరూ తెలంగాణ రాష్ట్రంలో బేల్దారి పనులు చేస్తున్నారు. కాగా మృతురాలి తమ్ముడు వసంతరావు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

రాతి మండప నిర్మాణానికి విరాళం


నగదును అందజేస్తున్న దాతలు

అద్దంకి, జూలై12(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం నిర్మాణానికి ముండ్లమూరు మండలం శంకరాపురం గ్రామానికి చెందిన బొల్లినేని ఆదినారాయణ, కవిత దంపతులు శనివారం రూ.1,00,116 నగుదను అందజేశారు. కార్యక్రమంలో దామా హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

16న దర్శిలో జాబ్ మేళా

దర్శి, జూలై 12(ఆంధ్రజ్యోతి): దర్శిలోని గౌతమీ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 16న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ కె.గుండారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 32 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తాం

● ఎమ్మెల్యే దామచర్ల

● తాగునీటి పైపులైను పనులకు శంకుస్థాపన


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో అమృత్ పథకం ద్వారా నగరంలోని ప్రతి చివరి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్పష్టం చేశారు. సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని 43, 44,45 డివిజన్లలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి శ్రీరామ్‌కాలనీ వరకు తాగునీటి సరఫరా పైపులైను పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మీడియాతో మాట్లాడుతూ సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. అత్యధిక శాతం ప్రజలు కూటమి ప్రభుత్వం పాలన తీరును మెచ్చుకుంటున్నారని, కొన్ని ప్రాంతాలలో కాలనీ సమస్యలను తెలిపారని చెప్పారు. అందులో భాగంగా ముందుగా తాగునీటి సమస్య పరిష్కారం కోసం పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గతంలో శ్రీరామ్‌కాలనీ వైపు వెళ్ళే పైపులైను 6 అంగుళాలు ఉండగా, దానిని స్థానంలో 12 అంగుళాల పైపులైను వేస్తామని పేర్కొన్నారు. దీంతో ప్రతి ఇంటికీ తాగునీరు అందుతుందని, ఇదే విధానాన్ని నగరమంతా అమలు చేస్తామని చెప్పారు. అలాగే అర్హులైన అందరికీ ఇళ్ళ స్థలాలు ఇస్తామని, కొత్త పెన్షన్లు మంజూరుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. సంక్షేమ పథకాలు అందరికీ అందిస్తామని, ఏడాదిలోనే ప్రజల మనసు గెలుచుకోవడం సంతోషంగా ఉందని దామచర్ల తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, కార్పొరేషన్ అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కూటమి పాలనలో సాధ్యం

● ఎమ్మెల్యే బీఎన్


మహిళకు కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మద్దిపాడు, జూలై 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతో సాధ్యమని ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం వెల్లంపల్లిలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో అందించిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విజయవంతంగా సంవత్సరం పూర్తి చేసుకుందని, ఈ ఏడాది కాలంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు దక్కుతుందన్నారు. రోడ్ల అభివృద్ధితో పాటు తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ పథకాలను అర్హులందరికీ అందిస్తున్నట్లు చెప్పారు. వెల్లంపల్లి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ మండవ జయంత్‌బాబు, పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మండపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడకా స్వాములు, ముచ్చు సుబ్బారావు, మండవ గోపీనాథ్, పోకూరి శ్రీనివాసరావు, దుగ్గినేని నరసింహారావు, బాలగురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ వర్గం గైర్హాజరు

వెల్లంపల్లిలో శనివారం జరిగిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమానికి ఎంపీటీసీ అద్దేపల్లి దుర్గాభవానీ, మాజీ సర్పంచ్ వేణురాజు వర్గం గైర్హాజరయ్యింది. దీంతో గ్రామంలో వర్గ విభేదాలు వెలుగుచూశాయి. ఎమ్మెల్యే బీఎన్ పర్యటనలో ఎంపీటీసీ హాజరుకాకపోవటంతో పలువురు చర్చించుకుంటున్నారు.

రాష్ట్ర ప్రగతి కోసం సీఎం చంద్రబాబు కృషి

● మారిటైం బోర్డు చైర్మన్ సత్య


మర్రిపూడిలో వృద్ధురాలికి కరపత్రాన్ని అందిస్తున్న చైర్మన్ సత్య

మర్రిపూడి, జూలై (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రగతే చంద్రబాబు పాలనలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య చెప్పారు. శనివారం మర్రిపూడిలో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల స్థలాలు, పక్కాగృహాలు మంజూరు చేయాలని కొందరు, సీసీరోడ్లు నిర్మించాలని ప్రజలు కోరారు. ఎస్సీకాలనీలో పైపులైన్‌లు ఏర్పాటు చేసి దాహార్తిని తీర్చాలని పలువురు మహిళలు కోరారు. తొలుత ఎన్టీఆర్, దామచర్ల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నర్సారెడ్డి, తెలుగురైతు కార్యనిర్వాక కార్యదర్శి యర్రమోతు శ్రీనివాసులు, నాయకులు రేగుల వీరనారాయణ, గొంటు హనుమారెడ్డి, సారెడ్డి సాయమ్మ, నర్సింహారెడ్డి, పాలగిరి వెంకటేశ్వర్లు, కొణిదెన మోహన్‌రావ్, గురవయ్య, గురుబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఎనికపాడులో..

సంతనూతలపాడు: సీఎం చంద్రబాబుతోనే సంక్షేమపాలన సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, మండల ప్రధాన కార్యదర్శి రావులపల్లి వెంకటసురేష్‌బాబు అన్నారు. శనివారం రాత్రి ఎనికపాడు గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను ఇంటింటికి తిరుగుతూ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. ప్రజలు అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నల్లూరి వెంకటరావు, పి.వెంకటరత్నం, వెంటేశ్వర్లు, వెంకట్రావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాన్ని అందజేస్తున్న హరిబాబు, సురేష్‌బాబు

దివ్యాంగ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

రాష్ట్రస్థాయి సమావేశంలో సంఘ నాయకుల డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, సహాయ సంస్థ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పలువురు కోరారు. శనివారం ఆ సంస్థ ఉద్యోగుల రాష్ట్రస్థాయి సమావేశం ఒంగోలులోని హైదరీక్లబ్‌లో జరిగింది. సంస్థ మాజీ జనరల్ ప్రధాన కార్యదర్శి కె.ఈశ్వర్ అధ్యక్షతన జరిగిన సభలో సౌత్ ఇండియా ఈపీఎఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎల్.మురళీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2010 పీఆర్సీ ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్పొరేషన్ ఉద్యోగులకు 62 ఏళ్ళ ఉద్యోగ విరమణ వయస్సును పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కె.ఈశ్వరయ్య వ్యవహరించారు. రాష్ట్ర అధ్యక్షుడుగా వై.హనుమంతరెడ్డి, (అనంతపురం), ఉపాధ్యక్షుడుగా వై.హనుమంతరావు(ఒంగోలు), ప్రధాన కార్యదర్శిగా కేసీహెచ్.రమణయ్య (విజయనగరం), ప్రాంతీయ కార్యదర్శులుగా ఎ.రామచంద్రరావు, చెంచులక్ష్మి, మధుసూదన్‌రావు, అంజిరెడ్డి, జాయింట్ సెక్రటరీగా శివప్రసాద్‌తో పాటు మరో పదిమందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, ఫిరోజ్ తదిత రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని పలువురు అభినందించారు.


ఎంపిక పోటీలకు విచ్చేసిన క్రీడాకారులు


పోటీలో తలపడుతున్న చిన్నారులు

షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పోటీల ప్రారంభం

ఒంగోలు కార్పొరేషన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులో క్రీడాకారుల ఎంపిక పోటీలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. స్థానిక లార్డ్‌కృష్ణ బాడ్మింటన్ అకాడమీలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 11, 13, 15, 17, 19 పురుషులు, మహిళా విభాగాలలో ఈ పోటీలు జరిగాయి, 25వ జిల్లా స్థాయి బాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ సందర్భంగా రెండు రోజులపాటు నిర్వహించనున్నారు. కాగా పోటీలను లార్డ్ కృష్ణ అకాడమీ ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళీకృష్ణ, పీడీబీఏ జిల్లా కార్యదర్శి పావులూరి విజయ్‌కుమార్, సీవీఎన్ క్లబ్ అధ్యక్షుడు ఈదుపల్లి గురునాథం తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌సైక్లిస్ట్‌కు గాయాలు


గాయపడిన చినబాబు

నాగులుప్పలపాడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్ అదుపు తప్పి యువకుడు గాయపడిన సంఘటన ఉప్పుగుండూరు గ్రామంలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. చినగంజాం మండలం పెదగంజాం పంచాయతీ పరిధిలోని బుచ్చిగుంట గ్రామానికి చెందిన చిరుమల చినబాబు శనివారం ఉదయం మోటార్‌సైకిల్‌పై మట్టిగుంట వైపు నుంచి స్వగ్రామం వెళుతున్నాడు. ఈక్రమంలో ఉప్పుగుండూరులోని గంగమ్మ హోటల్ కూడలి వద్దకు రాగా వాహనం అదుపు తప్పి కిందపడడంతో చినబాబుకు గాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం 108వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

ఖాతాదారుల సహకారంతో పురోభివృద్ధి

● సొసైటీ చైర్మన్ రాజు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఖాతాదారుల సహకారంతో ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ ఒంగోలు శాఖ ఈ ఏడాది మార్చి ఆఖరు నాటికి రూ.4,390 కోట్ల వ్యాపారం అధికమించిందని సొసైటీ చైర్మన్ పీఆర్‌వీపీఎస్.రాజు తెలిపారు. శనివారం ఒంగోలులోని కావేరి గ్రాండ్‌లో జరిగిన ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత మార్చి నెలాఖరు నాటికి సొసైటీకి రూ.82 కోట్ల లాభం వచ్చిందన్నారు. గత ఏడాది టెన్త్, ఇంటర్‌లో 95శాతంపైగా మార్కులు వచ్చిన సొసైటీ సభ్యుల పిల్లలకు రూ.34 లక్షల మెరిట్ అవార్డులను ఇస్తామని చెప్పారు. మేనేజింగ్ డైరెక్టర్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.5వేల కోట్ల టర్నోవర్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సొసైటీలో రుణాలు తీసుకొని సక్రమంగా చెల్లించిన వారికి ఒక శాతం రిబేటు కూడా ఇస్తున్నట్లు చెప్పారు. షేర్‌హోల్డర్లకు విజయ డయాగ్నిస్టిక్‌లో వైద్యపరీక్షల సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఒంగోలు శాఖ మేనేజర్ కె.ఆంజనేయులు, సభ్యులు బాదరయ్య, సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బౌద్ధ ధర్మ ప్రచారం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అషాడ పౌర్ణమి సందర్భంగా ఒంగోలు నగరంలో శనివారం బౌద్ధ ధర్మ ప్రచార కేంద్రం ఆధ్వర్యంలో బౌద్ధ ధర్మ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మంచి పుస్తకం కార్యాలయం నుంచి గాంధీపార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు మాట్లాడుతూ 2533 సంవత్సరాల క్రితం గౌతమబుద్ధుడు శీలము, జ్ఞానము ప్రధానంగా ఆషాడ పౌర్ణమిరోజున అష్టాంగ మార్గాన్ని బోధించాడని తెలిపారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు చావలి సుధాకరరావు, వై.నాగేశ్వరరావు, వై.మహేష్, చుండూరి రంగారావు, కత్తి కళ్యాణ్, అల్లు వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, పేరయ్య, బిసుబ్బారావు, పి.సత్యం, వెంకటస్వామి, దాసరి సుందరం, పి.మోహనరావు, మురహరి, ఏడుకొండలు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్విస్‌లో అవగాహన సదస్సు


జయరాజేశ్వరన్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు విద్య, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సరికొత్త సాంకేతికత, ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. చెన్నయ్‌కు చెందిన విమ్మైక్నో సిస్టమ్స్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జయరాజేశ్వరన్ ముఖ్యఅతిథిగా హాజరై ఇండస్ట్రీ 4.0 డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం, సీమిన్స్ కామన్ సిమిట్, లాట్2000 గేట్‌వే, ఏఐ, ఏఆర్‌వీఆర్‌లను పరిశ్రమల్లో ఎలా ఉపయోగిస్తారో వివరించారు. అనంతరం ఈసీఈ, ట్రిపుల్‌ఈ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో క్విస్ విద్యా సంస్థల అధినేత నిడమానూరి సూర్యకళ్యాణచక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గాయత్రి, డీన్ సత్యమెహర్, జాఫర్, ఈసీఈ హెచ్‌వోడి హిమబిందు, నవనీత్‌కృష్ణన్ పాల్గొన్నారు.

శ్రీహర్షిణి అధ్యాపకునికి డాక్టరేట్ ప్రదానం


రవికాంతరెడ్డికి డాక్టరేట్ పత్రాన్ని అందజేస్తున్న రవికుమార్

ఒంగోలు కలెక్టరేట్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని శ్రీహర్షిణి అండ్ పీజీ కళాశాలలో రసాయన శాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తున్న ఎల్.రవికాంతరెడ్డికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేశారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ జె.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఫైటోకెమికల్స్ ఎనాలసిస్, సైతోసిస్, క్యారెక్టరేజేషన్, యాంటి బ్యాక్టీరియల్ యాక్టివిటి అండ్ బయోలాజికల్ అప్లికేషన్ ఆఫ్ మెటాలిక్ (సిల్వర్, కాపర్ ఆక్సైడ్, జింక్అ క్సైడ్) నానో పార్టికల్స్ ఆఫ్ యు ఫర్ బియా సర్పెన్స్ లీతఫ్ ఎక్స్‌ట్రాక్ట్ అనే అంశంపై పరిశోధన చేసి పత్రాన్ని సమర్పించారు. దీంతో నాగార్జున యూనివర్శిటీ రవికాంత్‌రెడ్డికి డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. పీహెచ్‌డీ సాధించిన రవికాంతరెడ్డికి శనివారం స్థానిక కళాశాలలో డైరెక్టర్ గోరంట్ల రవికుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత డాక్టరేట్ పత్రాన్ని అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కాలేజీ డీన్ ఆంజనేయులు, జీఎం శివరామ్, పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసులరెడ్డి, ఏవో ర్యాంకర్ శ్రీను, క్యాంపస్ ఇన్‌చార్జి దిలీష్, ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విజయవాడలో ప్రజాసదస్సు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దళితులను దగా చేస్తోందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి అంద్ర మాల్యాద్రి ఆరోపించారు. స్థానిక ప్రజాసంఘతాల కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాబుజగ్జీవన్‌రామ్ పేరున ఎస్సీలకు 200 యూనిట్ల వరకు అందించే ఉచిత విద్యుత్‌ను ఒంగోలు నగరంలో అమలు చేయడం లేదన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్‌పథకంలో ఎస్సీలకు ఎటువంటి షరతులు లేకుండా సోలార్‌విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. రాష్ట్రంలో దళితులపై దాడులు, హత్యాచారాలు పెరిగిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆయా సమస్యలపై ఆదివారం విజయవాడలో ప్రజాసదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి బి.రఘురాం, అట్లూరి రాఘవులు, వి.మోజెస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలను చెల్లించాలి

ఒంగోలు విద్య, జూలై 12(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ.కీర్తి, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి.వెంకటరావు, లక్ష్మీనారాయణ, ప్రతినిధులు వై.శ్రీనివాసులు, ఎ.అమ్మయ్య, బి.అశోక్‌కుమార్, ఐఫియా కౌన్సిలర్స్ ఎం.రాఘవరావు, పీవీ.సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నాలుగు పెండింగ్ డీఏలు పెండింగ్‌లో ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. గత రెండేళ్ల నుంచి పీఆర్సీ కమిటీ వేయకపోవడం, ఐఆర్ ప్రకటించకపోవడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉద్యోగులు దాచుకున్న రూ.25,700 కోట్ల బకాయిలను ఇంత వరకు చెల్లించలేదన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించకపోతే మరో ఉద్యమం తప్పదనివారు హెచ్చరించారు.

ఏఎన్‌ఎంలకు సత్కారం


సిబ్బందిని సత్కరిస్తున్న ఉద్యోగులు

ఒంగోలు(రూరల్), జూలై 12(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం కరవది పీహెచ్‌సీలో పనిచేస్తూ బదిలీ అయిన ఏఎన్‌ఎంలు, ఇతర ఉద్యోగులను శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎంలు పి.జయకుమారి, అజితకుమారి, ప్రేమకుమారి, కెజియా, శ్రీలక్ష్మి, సుబ్బమ్మ, సరతి, ఆఫీస్ సబార్డినేట్ రమణమ్మలను సొసైటీ మాజీ అధ్యక్షుడు పోలవరపు వెంకటరామయ్య, సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు, డాక్టర్ సుందరప్రసాద్ డాక్టర్ చైతన్య సన్మానించి వారి సేవలను కొనియాడారు. అలాగే వైద్యశాల అభివృద్ధికి లక్ష్మీనారాయణ రూ.1.80లక్షలు, శిరిగిరి కృష్ణారావు రూ.70వేలు, సైలేష్ పెద్దరాజు రూ.25వేలు చెక్కులను డాక్టర్ సుందరప్రసాద్‌కు అందజేశారు. దాతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

కనిపించని పరిశ్రమల జాడ

- గిద్దలూరులో ఐదు దశాబ్దాల క్రితం ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏర్పాటు
- స్థలం కొనడం, ఫెన్సింగ్ వేయడంతో సరి
- లభించని ఉపాధి అవకాశాలు
- పట్టించుకోని ఏపీఐఐసీ అధికారులు



పెయింట్ ఊడిపోయి తుప్పు పట్టి స్వాగతం పలుకుతున్న ఇండస్ట్రియల్ ఎస్టేట్ బోర్డులు

గిద్దలూరులో ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏర్పడి 5 దశాబ్దాలు గడుస్తున్నా ఒక్కచిన్న పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదు. పట్టణానికి ఆనుకుని అనువైన స్థలంలోనే ఇది ఉంది. విశాలమైన రోడ్లు, విద్యుత్ సౌకర్యంతో కల్పించారు. భవిష్యత్‌లో స్థలాలకు రేట్లు పెరుగుతాయన్న కారణంగా చాలా మంది ఎస్టేట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసి చుట్టూ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. సంవత్సరాలు కాదు దశాబ్దాలు గడుస్తున్నా చిన్నపాటి పరిశ్రమను కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తోంది.

గిద్దలూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరులో ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏర్పాటు చేసి 5 దశాబ్దాలు గడిచినా పరిశ్రమల ఏర్పాటు ఊసే లేకుండాపోయింది. ఎస్టేట్ మొత్తం కంప చెట్లు, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. చాలా విద్యుత్ పోల్స్‌కు వీధిలైట్లు కూడా లేవు. కొత్తగా ఎవరైనా పరిశ్రమ పెట్టాలంటే అమ్మేందుకు ప్లాట్లు ఖాళీ లేవంటూ జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులు సమాధానం చెపుతున్నారు. వాస్తవానికి ఎస్టేట్‌లోకి వెళితే అన్ని ప్లాట్లు ఖాళీగా కంపచెట్లతో దర్శనమిస్తున్నాయి. దాంతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నారు. మరికొందరు ఊరికి దూరంగా వ్యవసాయ పొలాలను కొనుగోలు చేసి చిన్నపాటి పరిశ్రమలను ఏర్పాటు చేసుకుంటున్నారు. తీసుకున్న ప్లాటులో సమయం ఇచ్చి పరిశ్రమ ఏర్పాటు చేస్తారా, లేదా ప్లాట్లు పరిశ్రమల శాఖకు రిటర్న్ చేస్తారా అంటూ నోటీసులు ఇచ్చి స్వాధీనం చేసుకోవాలని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు కోరుతున్నారు.

నల్లమల అటవీ ప్రాంతానికి సరిహద్దులో ఉన్న గిద్దలూరులో పారిశ్రామికవాడను ఏర్పాటు చేస్తే పెద్ద ఎత్తులో ఉపాధి లభిస్తుందని, అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు అవుతాయని, ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని భావించి పిడతల రంగారెడ్డి మంత్రిగా పని చేసే సమయంలో గిద్దలూరులో పారిశ్రామికవాడను ఏర్పాటు చేశారు. అయితే అధికారులు, పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా పారిశ్రామికవాడ నిరుపయోగంగానే పడి ఉన్నది. హెర్బల్, అటవీ ఆధారిత ఉత్పత్తులు స్థానికంగా పెద్ద ఎత్తున లభ్యమవుతున్నప్పటికీ వాటి ఆధారిత పరిశ్రమ ఏర్పాటు కావడం లేదు. పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్ యూనిట్లు, మరీ ముఖ్యంగా వేలాది ఎకరాల్లో పండే టమాటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసుకునే అవకాశం పుష్కలంగా ఉంది. ఆగ్రో, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, మినరల్ బేస్డ్ పరిశ్రమలు, లెదర్ పరిశ్రమల ఏర్పాటుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. కానీ పరిశ్రమల శాఖల అధికారులు ఏనాడూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో అవగాహన సమావేశాలు ఏర్పాటు చేయలేదు. ప్లాట్లు కావాలన్న వారికి కేటాయించి డబ్బులు దండుకున్నారే తప్ప ప్లాట్లు కొనే సమయంలో వారు ఏర్పాటు చేస్తామన్న పరిశ్రమలు ఏళ్లు గడుస్తున్నా ఎందుకు పెట్టడం లేదని నోటీసులు కూడా ఇవ్వడం లేదు. కొత్తగా ప్లాట్లు లేకపోవడంతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు నిరుత్సాహానికి గురై ఇతర ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. ఎస్టేట్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే విద్యుత్, ట్యాక్స్ రాయితీలు ఉంటాయి. పరిశ్రమలు లేకపోయినా స్థలాలు లేక ఇతర స్టేట్‌లలో గిద్దలూరు ప్రాంత వ్యాపారులు చిన్నపాటి పరిశ్రమలను ఏర్పాటు చేసుకుంటుండడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు, ఏపీఐఐసీ అధికారులు స్థానికంగా సర్వే చేసి పరిశ్రమల ఏర్పాటుకు తగిన విధంగా చర్యలు తీసుకోవడానికి, అవసరమైతే మరికొంత భూమిని సేకరించి పరిశ్రమలు పెట్టే కొత్త వారికి అవకాశాలు కల్పించి ఉపాధి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.





కాంపౌండ్ వాల్ నిర్మాణానికే పరిమితమైన ప్లాట్లు (ఇన్‌సెట్లో) అధ్వానంగా ఉన్న ఎస్టేట్‌లోని అంతర్గత రహదారులు



బాదినేనిపల్లిలో పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఏఎస్పీ

సత్తాచాటిన బాపట్ల జిల్లా ఎడ్లు

కొమరోలు, జూలై 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాదినేనిపల్లి గ్రామంలోని రెడ ఖాశిం స్వామి పీర్ల పండుగ మహోత్సవాల సందర్భంగా జరిగిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీల్లో బాపట్ల జిల్లా జిల్లా ఎడ్లు సత్తాచాటాయి. విశ్రాంత ఏఎస్పి కామూరి రమణారెడ్డి పోటీలను ప్రారంభించారు. ఈపోటీల్లో 8 ఎడ్లజతలు పాల్గొన్నాయి. బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన ఆర్‌కే బుల్స్ శిరీష చౌదరి ఎడ్ల జత 5,646 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలవగా రూ.50వేల బహుమతిని కామూరి బ్రదర్స్ అందచేశారు. కడప జిల్లా బాలయ్యపల్లి గ్రామానికి చెందిన షేక్ మహిమున్న మల్లెల, విష్ణువర్ధన్‌రెడ్డి ఎడ్లజత 5,230 అడుగుల దూరం లాగి ద్వితియ బహుమతిగా రూ.40వేలను చావిడి నిర్వాహకులు అందచేశారు. నంద్యాల జిల్లాకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి ఎడ్లజత 5123అడుగుల దూరం లాగి, తృతీయ బహుమతిగా రూ.30వేలు, ఎర్రిబోయి వెంకటయ్య, కడపజిల్లి తాడిగొట్ల గ్రామానికి చెందిన లక్ష్మిరెడ్డి, వెంకట్రామిరెడ్డి ఎడ్ల జత 5021అడుగుల దూరం లాగి నాల్గోవ బహుమతిగా రూ.20వేలు, ముత్తుముల ఎల్లారెడ్డి, ముత్తుముల జంగంరెడ్డి, నంద్యాల జిల్లా వనికందిన్నె గ్రామానికి చెందిన పెద్ద సరబయ్యకు చెందిన ఎడ్ల జత 4,800 అడుగుల దూరం లాగి ఐదో బహుమతిగా రూ.15వేలను కామూరి బ్రదర్స్, ప్రకాశం జిల్లా ఎర్రబాలెం గ్రామానికి చెందిన 4,066అడుగుల దూరం లాగి 6వ బహుమతిని ఇర్రి వెంకటేశ్వర్లు, కడప జిల్లా తెల్లపాడు గ్రామానికి చెందిన కాశింబుల్స్ జయన్న ఎడ్లజత 3,400అడుగుల దూరం లాగి ఏడవ బహుమతి రూ.5వేలను ఇదే గ్రామానికి చెందిన వేమారెడ్డి శ్రీనివాసరెడ్డి అందచేశారు. మనోజ్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కామురి రమణారెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు.

ఇసుక రీచ్ నిర్వాహకుల దౌర్జన్యం

నాలుగు రోజులుగా అన్‌లోడ్ చేయనివ్వలేదని లారీ డ్రైవర్ ఫిర్యాదు

ఇన్‌చార్జి కలెక్టర్ ఆదేశంతో మైనింగ్ శాఖ అధికారుల పరిశీలన

ఎట్టకేలకు లబ్ధిదారుడి చెంతకు ఇసుక



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న గనులశాఖ టెక్నికల్ అసిస్టెంట్ బాలరాజు

పొదిలి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టడంతో ప్రజలు సంతోష పడ్డారు. వైసీపీ పాలనలో ఇసుక దోపిడీతో పలు గృహ నిర్మాణ యజమానులు తీవ్ర ఇక్కట్లపాలయ్యారు. అప్పట్లో వైసీపీ నాయకులు ఇసుకను బంగారంలా అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇసుక విధానంపై కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రతి ఒక్కరూ అందుబాటు ధరలో ఇసుక పొందేలా నిల్వ కేంద్రాలను (ఇసుక రీచ్) ఏర్పాటు చేశారు. పొదిలిలో ఏర్పాటు చేసిన నిల్వ కేంద్రం నిర్వాహకులు గత ప్రభుత్వంలో మాదిరిగానే దందా కొనసాగిస్తున్నారని లారీ యజమాని అంబటి ధినేష్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. ప్రజలకు ఎక్కడ అందుబాటులో ఉంటే ఆన్‌లైన్ ద్వారా ఇసుకను కొనుగోలు చేసుకునే సౌకర్యం ఉంది. పట్టణంలో పలువురు గృహ నిర్మాణ యజమానులు నెల్లూరు పెన్నా నది నుంచి ఆన్‌లైన్ ద్వారా ఇసుకను కొనుగోలు చేసి చెన్నై వైపు నుంచి వచ్చే ఖాళీ లారీల ద్వారా తక్కువ ఖర్చుతో ఇసుకను అన్‌లోడు చేయించుకుంటున్నారు. ఈ క్రమంలో ఇసుక లోడుతో వచ్చిన లారీలను ఇక్కడ కేంద్రం నిర్వాహకులు ఇబ్బంది పెడుతున్నారని లారీ యజమానులు వాపోతున్నారు. మీరు ఎక్కడ నుంచి తెచ్చుకున్నా టన్నుకు రూ.350 చెల్లించాలని లేకపోతే ఇసుక లారీని అన్‌లోడు చేయనివ్వమని నిర్వాహకుడు అడ్డుకుంటున్నారని లారీ యజమాని ధినేష్‌రెడ్డి చెప్పారు. ముందుగా స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో ఇన్‌చార్జి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎంతో వ్యయప్రయాసలకోర్చి ఇసుకను తెస్తున్నా అది వినియోగదారుడికి చేరడం లేదని, దీంతో పనులు నత్తనడకన సాగుతున్నాయని పలువురు గృహ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులుగా ఒక గృహ యజమాని ఉదయ్‌భాస్కర్ ఆధార్‌కార్డుపై 9వ తేదీన ధినేష్‌రెడ్డి పొదిలికి ఇసుక లారీని తీసుకొచ్చారు. అన్నీ సక్రమంగా ఉన్నా డబ్బులు ఎందుకు కట్టాలని భావించిన ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన జోక్యం చేసుకొని సత్వరమే ఇసుక లారీలను పరిశీలించి ఇసుక అన్‌లోడు చేయించాలని మార్కాపురం గనుల శాఖ అధికారులను ఆదేశించారు. ఈక్రమంలో మర్కాపురం గనుల శాఖ టెక్నికల్ అసిస్టెంట్ బాలరాజు పొదిలిలో ఇసుక లారీలను పరిశీలించి రసీదులన్నీ సక్రమంగా ఉన్నాయని గృహ నిర్మాణ యజమాని ఇంటి దగ్గర అన్‌లోడు చేయాలని ఆదేశించారు. అనంతరం ఆ ఇంటి వద్ద అన్‌లోడ్ చేయించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని ఇన్‌చార్జి కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ విషయమై మైనింగ్ శాఖ ఏడీ విష్ణువర్ధన్ రావును వివరణ కోరగా.. గృహాల నిర్మించుకునే యజమానులు ఎక్కడినుంచైనా ఇసుకను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకొని తెచ్చుకోవచ్చని స్పష్టం చేశారు. ఎంతమంది కలిసి తెప్పించుకుంటారో వారి పేర్లు మొత్తం నమోదు చేయాలని సూచించారు.

ఆనందోత్సాహాల నడుమ ఆత్మీయ సమ్మేళనం

పులకరించిన గంగవరం



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న చైర్మన్ కృష్ణయ్య

ఇంకొల్లు, జూలై 12,(ఆంధ్రజ్యోతి): గంగవరంలో చదువుకొని ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకే చోట కలిశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 69 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థుల కలయికతో గంగవరం పులకరించింది. వీరందరి కలయికకు శ్రీవలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాల శనివారం వేదిక అయ్యింది. డాక్టర్లు, ఇంజనీర్లు, ఉన్నత స్థాయి ఉద్యోగాలలో స్థిరపడి దూరప్రాంతాలలో ఉన్న వారంతా కలిసి ఆనందోత్సాహాలను పంచుకున్నారు.చదువు నేర్పిన గురువులను గుర్తు చేసుకున్నారు. మండలంలోని గంగవరం వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కృష్ణయ్య మాట్లాడుతూ పూర్వకాలంలో ఎకరాలు ఉన్నవారు ధనవంతులని ప్రస్తుత సమాజంలో విద్యతో జ్ఞానం కలిగిన వారే ధనవంతులని, విద్యకు ఉన్న ప్రాముఖ్యతను వివరించారు. పూర్వవిద్యార్థుల సహకారంతో పాఠశాలకు పూర్వవైభవం తేవాలని ఆయన కోరారు. పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ వలేటి కృష్ణయ్య తాత 1956లోనే ముందుచూపుగా విద్యను పంచాలని ఈ పాఠశాలను స్థాపించడం ఎంతో గర్వకారణమన్నారు.ఈ పాఠశాలలో చదువుకున్న వారెందరో ప్రస్తుతం ఉన్నత స్థానాలలో స్థిరపడ్డారన్నారు. పేద కుటుంబాలలో వెలుగు నింపేందుకు ఆనాటి చదువులు ఎంతో దోహదపడ్డాయన్నారు.1956లో పాఠశాల స్థాపించిన మొదటి సంవత్సరం ఇక్కడ చదువుకున్న చిలుకూరి నారాయణ (88) సభలో పాల్గొని తమ జ్ఞాపకాలను వివరించారు.పూర్వ విద్యార్థి ప్రసాద్ రూ.2లక్షలు పాఠశాలకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులను సన్మానించారు. సర్పంచ్ సుధాకర్, ప్రధానోపాధ్యాయురాలు సమత, రామసుబ్బారావు, కరి సుబ్బారావు,డాక్టర్ రమేష్‌బాబు, ఏలూరి సిద్దయ్య, చిలుకూరి శ్రీధర్, గోపి, కరి కమలేశ్వరరావు, వీరాంజనేయులు,వలేటి అంజయ్య, శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్లక్ష్య వైద్యులపై చర్యలు

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చీరాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏరియా వైద్యశాలలోని ఆరోగ్య సిబ్బందిపై జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నట్లు సమాచారం. శనివారం ఆంధ్రజ్యోతిలో కాన్పుల వార్డులో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై కథనం ప్రచురితమైంది. ఈక్రమంలో విషయంపై విచారణ చేపట్టిన జిల్లా యంత్రాంగం ఇద్దరు వైద్యులతో పాటు ఇద్దరు నర్సులకు మెమోలు అందించినట్లు తెలిసింది.

వివేక్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి స్వాధీనం

ఒంగోలు క్రైం, జూలై12 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో తనిఖీలలో భాగంగా వీవేక్ ఎక్స్‌ప్రెస్‌లో సుమారుగా నాలుగు కిలోలు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. శుక్రవారం రైల్వే పోలీసులు, ఈగల్ టీమ్ సంయుక్తంగా పెళ్లూరు సమీపంలో వివేక్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేయగా రెండు బ్యాగుల్లో ఉన్న 3.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దాని రూ.7 వేలు ఉంటుందన్నారు. అయితే ఆ గంజాయి ఎవరు తరలిస్తున్నారనేది తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మాజీ సైనికుల ఇళ్లల్లో చోరీ

బంగారు ఆభరణాలు, నగదు అపహరణ



బీరువా పగులగొట్టి చిందరవందరగా పడేసిన వస్తువులు



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

కంభం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : కంభం పట్టణంలో వేరువేరు ప్రాంతాల్లో ఇద్దరు మాజీ సైనికుల గృహాలలో దొంగలుపడి బంగారు నగలు, నగదు అపహరించుకుపోయారు. పోలీసుల కథనం ప్రకారం.. కంభం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రహమత్‌నగర్ మొదటిలైన్‌లో నివసిస్తున్న మాజీ సైనికులు చల్లా కోటయ్య కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం బేస్తవారపేట మండలం సలకలవీడుకు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి సాయంత్రం ఇంటికి రాగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. 3 ఉంగరాలు, చెవిపోగులు, కమ్మలు మొత్తం 3 తులాల ఆభరణాలు, రూ.2వేల నగదు అపహరించినట్లు గుర్తించారు. ఎల్‌బీఎస్‌నగర్‌లో ఉంటున్న మరో మాజీ సైనికుడు రంగనాయకులు 10 రోజుల కిందట కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లగా మిద్దె ఇంట్లో కటాంజనం తెరిచి ఉండడంతో గ్రామస్థులు పైకి వెళ్లి చూడగా తాళం పగులగొట్టి ఉన్నది. వారు ఫోన్‌లో యజమానికి సమాచారం ఇచ్చారు. బీరువాలో ఉంచిన మూడున్నర తులాల నగలు, రూ.10వేల నగదు చోరీ జరిగినట్లు యజమాని తెలిపాడు. చోరీ జరిగిన రెండు గృహాలను ఎస్ఐ నరసింహారావు పరిశీలించి క్లూస్ టీమ్‌ను పిలిపించి వేలిముద్రలు సేకరించారు.

అద్దంకి నుంచి తిరుపతికి బస్ సర్వీస్



అద్దంకి నుంచి తిరుపతికి నూతన బస్ సర్వీసు ప్రారంభంలో కార్మికులు, అధికారులతో అసిస్టెంట్ డీఎం మహబూబి

అద్దంకి,జూలై12(ఆంధ్రజ్యోతి): అద్దంకి నుంచి తిరుపతికి శనివారం రాత్రి అసిస్టెంట్ డీఎం మహబూబి కొత్త ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసును ప్రారంభించారు. ప్రతి రోజు రాత్రి 8.30 గంటలకు 48070 సర్వీసు నంబరులోని ఎక్స్‌ప్రెస్ బస్ అద్దంకిలో బయలుదేరి ఒంగోలు, కావలి, నెల్లూరు మీదుగా ఉదయం 4-30 గంటలకు తిరుపతి చేరుతుందని అసిస్టెంట్ డీఎం మహబూబి తెలిపారు. తిరుగు ప్రయాణంలో ఉదయం 8 గంటలకు బయలుదేరి సాయంత్రం 4-15 గంటలకు అద్దంకి చేరుకుంటుందన్నారు.. రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందని, చార్జీ రూ.440, హాఫ్ టికెట్ రూ.255, సీనియర్ సిటిజన్స్‌కు రూ.350 చార్జీ వసూలు చేయనున్నట్లు తెలిపారు. అద్దంకి ప్రాంతం నుంచి తిరుపతి, తిరుమల వెళ్లే ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది వలి, బాబ్జీ, కొండలు, కార్మిక సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ బార్లుగా పార్క్‌లు

- మందుబాబుల అడ్డాగా మారిన వైనం
- అక్కడకు వెళ్లేందుకు జంకుతున్న చిన్నారులు, మహిళలు
- అపరిశుభ్రానికి కేరాఫ్
- చోద్యం చూస్తున్న అధికారులు



చిల్లచెట్లతో మూసుకుపోయిన జిమ్ పరికరాలు

గిద్దలూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ మున్సిపల్ పార్కు చుట్టూ నివాస గృహాలు, వ్యాపార సంస్థలు ఉన్నాయి. పచ్చని చెట్లతో చిన్నారుల కేరింతలతో మహిళల ముచ్చట్లతో కళకళలాడాల్సిన ఈ పార్కు మందుబాబులకు అడ్డాగా మారింది. ఓపెన్‌బార్‌గా పిలువబడుతున్నది. నిత్యం మందుబాబులు పార్కుకు చేరుకుని మద్యం సేవిస్తూ పాన్‌పరాక్ వేసుకుంటూ, సిగరెట్ పొగలు వదులుతుండడంతో ఈ పార్కులోకి వెళ్లాలంటేనే చిన్నారులు, మహిళలు జంకుతున్నారు. ఎవరూ రారన్న ధీమాతో మందుబాబులు మున్సిపల్ పార్కును అడ్డాగా చేసుకున్నారు. చుట్టుపక్కల వారు కూడా ఈ పార్కులోకి ఎవరూ రావడం లేదని, తమ ఇంట్లో ఉన్న చెత్తాచెదారాన్ని అక్కడే పడవేస్తున్నారు. ఓపెన్ జిమ్ పరికరాలన్నీ చిల్లచెట్లతో మూసుకుని పోతున్నాయి. మందుబాబులు లేని సమయంలో కొంత మంది చిన్నారులు వెళ్తున్నప్పటికీ చిల్లచెట్లలో ఉన్న జిమ్ పరికరాల వద్దకు వెళితే చెట్లలో కనపడకుండా ఉండే విషపురుగులు భయాందోళనను కలిగిస్తున్నాయి. పట్టణంలోని రేడియోబావి సెంటర్ నుంచి కొప్పువారివీధి, ఆంటీహోటల్ ఎదురు రోడ్ల నుంచి మొత్తం 3 ఎంట్రెన్స్‌లు ఉండగా రాళ్లు, రప్పలు, చెత్తాచెదారంతో లోపలికి వెళ్లాలంటే కూడా ముక్కుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటున్నదని ప్రజలు వాపోతున్నారు. మరికొందరు మలమూత్ర విసర్జనలకు కూడా ఈ పార్కును వినియోగిస్తున్నారు. ఈ మున్సిపల్ పార్కు పట్టణ నడిబొడ్డున ఉండగా మున్సిపల్ అధికారులు మాత్రం తమ పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేస్తున్న దాఖలాలు లేకపోవడం వారి నిర్లక్ష్యానికి మచ్చుతునకగా మారింది. సందర్శకులు, చిన్నారులు వస్తే కూర్చునేందుకు బెంచీలు కూడా ఏర్పాటు చేయలేదు. 2 చెట్లు ఉండగా ఆ చెట్ల పాదుల చుట్టూ 2 అరుగులు నిర్మించారు. ఒక అరుగు పూర్తిగా నేలమట్టం కాగా మరో అరుగుకు వేసిన బండలను సైతం చోరీ చేశారు. మట్టి తేలి కూర్చునేందుకు వీలులేని పరిస్థితి నెలకొంటున్నది. ప్రస్తుత ఈ పార్కులోకి వెళితే మద్యం వాసన, సిగరెట్ పొగలు గుప్పుమంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పార్కు మొత్తాన్ని శుభ్రం చేసి మందుబాబులు లోపలికి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆప్రాంత మహిళలు, చిన్నారులు కోరుతున్నారు.



నేలమట్టమైన అరుగు



అధ్వానంగా పార్కు ఎంట్రెన్స్



పార్క్‌లో పడేసిన మద్యం సీసాలు, గుట్కా, సిగరెట్ ప్యాకెట్లు



పేరుకుపోయిన చెత్తాచెదారం



దత్తత తీసుకున్న విద్యార్థులతో ఎంపీడీవో

ముగ్గురు విద్యార్థులను దత్తత తీసుకున్న ఎంపీడీవో

ఎర్రగొండపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పీ-4 కార్యక్రమంలో భాగంగా ఎర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులను ఎంపీడీవో శ్రీనివాసరావు దత్తత తీసుకున్నారు. ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో 9 వతరగతి చదువుతున్న పీ శివాజీ, ఇదే పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్న పీ సురక్షిత, ఇదే పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న షేక్ సైదాబీని దత్తత తీసుకున్నట్లు ప్రకటించారు. ఈ ముగ్గురు విద్యార్థులకు అన్ని మౌలిక సౌకర్యాలు కల్పిస్తానని తెలిపారు. ముగ్గురికి తల్లిదండ్రులు లేనందున పాఠశాల చదువు ముగిసే వరకు వారి ఆలనాపాలనా తాను చూసుకుంటానని తెలిపారు. ప్రజా ప్రతినిధులు ఒక్కొక్కరు నలుగురు విద్యార్థులను దత్తత తీసుకోవాలని ఎంపీడీవో కోరారు.

సారా నిషేధంపై అవగాహన

పెద్ద దోర్నాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం ఎస్‌హెచ్‌వో, ఈఎస్‌టీఎఫ్, ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మండలంలోని పెద్దబొమ్మలాపురం, చింతల, బోడేనాయక్ తాండా, తుమ్మల బైలు, చిన్నారుట్ల గ్రామాల్లో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సీఐ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో శనివారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఎటువంటి కేసులు లభించకపోవడంతో సంతృప్తి చెందిన అధికారులు అనంతరం ఆ గ్రామాల్లో నాటుసారా నిషేధంపై అవగాహన కల్పించారు.



దారిని పరిశీలిస్తున్న అటవీ అధికారులు

కాటంరాజు ఆలయ రహదారి పరిశీలన

పెద్దారవీడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాటంరాజు దేవస్థానానికి రహదారిని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆలయానికి వెళ్లేందుకు నల్లమల అడవిలో దారి మూసుకుపోయి ఉందని, రోడ్డు ఏర్పాటుకు సర్వే చేయించాలని ఇటీవల మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్‌కు దేవస్థాన చైర్మన్ గుమ్మా గంగరాజు వినతిపత్రం అందజేశారు. అధికారులు సూచన మేరకు అటవీశాఖ అధికారులు నాగరాజు, రవికుమార్ ఆ రోడ్డును శనివారం పరిశీలించారు. చిన్నదోర్నాల వైపు నుంచి రోడ్డును అధికారులు సర్వే జరిపారు. త్వరలో అధికారులు సహకారం, దాతల దాతృత్వంతో ఆలయ పునర్‌నిర్మాణంతోపాటు దేవస్థానానికి వెళ్లే దారిని తారురోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తామని ఆలయ కమిటీ తెలిపింది.

కార్మికుల ర్యాలీ

గిద్దలూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మెకు దిగిన మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు శనివారం ప్రధాన వీధుల గుండా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా బైక్ ర్యాలీ కూడా చేపట్టారు. జీవో 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, క్యాటగిరీ వైజ్‌గా కార్మికులందరికీ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ అయిన కార్మికుల పిల్లలకు ఉద్యోగం కల్పించాలని, ఉద్యోగ వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచాలని కోరారు. గత సమ్మెకాలం ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్, కార్మిక సంగం నాయకులు మస్తాన్‌రెడ్డి, మౌళాలి, నాగయ్య, పుల్లయ్య పాల్గొని ప్రసంగించారు.

నేడు వ్యాసరచన పోటీ

గిద్దలూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖ గ్రంథాలయం ఆవరణలో 13వ తేది ఆదివారం ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకురాలు ఎస్.ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, కార్యదర్శి ఫరూఖ్ ఒక ప్రకటనలో తెలిపారు. 6, 7 తరగతులు చదువుతున్న విద్యార్థులకు స్వామి వివేకానందుని జీవితం గురించి, అలాగే 8, 9, 10 చదువులున్న విద్యార్థులకు తల్లిదండ్రులు - ప్రత్యక్ష దైవాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలుగు మీడియంలో వ్యాసరచన పోటీలు జరుగుతాయని, విజేతలకు బహుమతులు అందజేస్తామని ప్రకటించారు.

కార్యకర్తలను పరామర్శించిన ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి వినుకొండ ఆసుపత్రిలో చికిత్స పొందుతన్న ఐటివరం టీడీపీ కార్యకర్తలను టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పరామర్శించారు. శనివారం వినుకొండ ఆసుపత్రికి వెళ్లిన ఆయన నూకతోటి నరసింహులు, నూకతోటి శ్రీరాములును పరామర్శించి ఆర్థిక సాయమందించారు. ఆయనవెంట టీడీపీ మండల నాయకులు కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, పోట్ల గోవింద్ ఉన్నారు.

192 మద్యం బాటిళ్లు పట్టివేత.. వ్యక్తి అరెస్ట్

త్రిపురాంతకం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జి.ఉమ్మడివరం బస్‌షెల్టర్ వద్ద మద్యం అక్రమంగా కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎర్రగొండపాలెం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడి చేయగా తోట శ్రీను అనే వ్యక్తి మద్యం సీసాలు కలిగి ఉండగా పట్టుకుని అతని వద్ద నుంచి 192 విస్కీ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వీటి విలువ రూ.30వేల720 అన్నారు. తోట శ్రీనును అరెస్టు చేయడంతోపాటు హీరో హోండా బైక్‌ను, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.



పట్టుబడిన మద్యం సీసాలతో ఎక్సైజ్ పోలీసులు

బస్సు, బైక్ ఢీకొని.. యువకుడి మృతి

పొదిలి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : బస్సు, బైకు ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే పొదిలి, ఒంగోలు జాతీయ రహదారిపై కాటూరివారిపాలెం, అగ్రహారం గ్రామాలకు మధ్య శనివారం ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు, మోటార్ సైకిల్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎం.నెహేమియా (32) అక్కడికక్కడే మృ తి చెందాడు. మర్రిపూడి మండలం శివరాయునిపేటకు చెందిన నెహేమియా ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. విషయం తెలుసుకున్న సీఐ వెంకటేశ్వర్లు ప్రమాదం జరగడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



నెహేమియా మృతదేహం

ఫైనాన్స్ బిల్‌ను వెంటనే రద్దు చేయాలి

పొదిలి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఫైనాన్స్ బిల్‌ను వెంటనే రద్దు చేయాని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఏ బాదుల్లా అన్నారు. శుక్రవారం పెన్షనర్ల భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బిల్లు అమలైతే కొత్త, పాత పెన్షన్స్ మధ్య వ్యత్యాసం ఏర్పడి పాతపెన్షన్ దారులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. ప్రధాన కార్యదర్శి మదార్ వలి మాట్లాడుతూ ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్, స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోషియోషన్ ఆదేశాల మేరకు ఈనెల 15వ తేదీన ఒంగోలు కలెక్టరేట్ ముందు జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి

పొదిలి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయెషాబేగం అన్నారు. శుక్రవారం స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో కేసులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతే కాకుండా మద్యం ఎంఆర్‌పీ ధరలకు అమ్మాలని ఎక్కువ ధరలకు అమ్మితే రచ్యలు తప్పవని హెచ్చరించారు. ముందుగా కార్యాలయ రికార్డులను పరిశీలించారు. కార్యాలయంలో సీఐ అరుణకుమారి ఉన్నారు.



ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ ఆయెషాబేగం



కల్యాణ క్రతువులో పాల్గొన్న భక్తులు

కనులపండువగా చెన్నయ్య కల్యాణం

మార్కాపురం వన్‌టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామికి శాంతి కల్యాణం శనివారం కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవస్వామి మూల విరాట్‌కు సుప్రభాత సేవ, అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ మధ్య రంగ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ ఘట్టాలు పూర్తిచేశారు. రాయలసీమ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. ఈఓ గోలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అరుణ్ కుమారాచార్యులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంతలక్ష్మి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ నాయకులు పిచ్చిరావు, రామారావు, ఎన్‌వీ రమేష్ సన్మానించారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

కంభం : శ్రవణానక్షత్రం సందర్భంగా కంభంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిపించారు. ఈ క్రతువులో పలువురు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి ఆంజనేయ శర్మ స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపేతధారణతోపాటు స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రజా వేదికలో వచ్చే అర్జీలకు పరిష్కారం

ఎర్రగొండపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజా వేదికలో ప్రజలు ఇచ్చే ప్రతి అర్జీని పరిష్కరిస్తామని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం జరిగిన ప్రజావేదికలో ప్రజల నుంచి అర్జీలను ఎరిక్షన్‌బాబు స్వీకరించారు. ప్రాధాన్యత ఉన్న 5 అర్జీలను టీడీపీ కార్యాలయంలోనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపారు. మరో 10 అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావుకు సిఫార్స్ చేశారు. సమస్యలున్నవారు ప్రజా వేదికను వినియోగించుకోవాలని ఎరిక్షన్‌బాబు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

అధికార ఒత్తిళ్లకు తలొగ్గం

ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి

మార్కాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : అధికార పార్టీ నాయకులు ఎన్ని ఒత్తిళ్లకు గురి చేసినా వైసీపీ కార్యకర్తలు తలొగ్గరని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక బీ కన్వెన్షన్ హాలులో శనివారం వైసీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ పర్యటనలను అడ్డుకోవడమే అధికార పార్టీ అజెండా అన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, నాయకులు షంషీర్ అలీబేగ్, వెన్నా హనుమారెడ్డి, చిర్లంచర్ల కృష్ణ, జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి

పేదలందరికీ సంక్షేమ ఫలాలు



పథకాలను వివరిస్తున్న ఎరిక్షన్‌బాబు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న మల్లయ్య

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. స్థానిక ఇశ్రాయలేపేటలో శనివారం సాయంత్రం సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. కొద్ది రోజుల్లో అన్నదాతకు సాయం డబ్బులు అందజేస్తారని, వచ్చేనెల 15వ తేదీ నుంచి ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి వస్తుందని ఎరిక్షన్‌బాబు తెలిపారు. స్థానిక సమస్యలు తెలుసుకున్న ఆయన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం

మల్లయ్య

పెద్ద దోర్నాల : ప్రజా సంక్షేమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఈదర మల్లయ్య అన్నారు. చిం తల అగ్రహారం గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని శనివా రం నిర్వహించారు. ఈదర మల్లయ్య ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం పథకాలను వివరించారు. ప్రజల బాగోగులను పట్టించుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందరూ మద్దతుగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, చలమారెడ్డి, చల్లా కాశీరావు, అన్నపురెడ్డి, హనుమంతు, నలబోతుల వెంకటేశ్వర్లు, రమణయ్య, నరసింహులు పాల్గొన్నారు.

గోకులం షెడ్లకు నిధులు

- నియోజవర్గంలో 123గాను 104 పూర్తి
- రూ.కోటీ36లక్షలకు పైగా విడుదల
- నిర్వాహకుల హర్షం



కొలుకుల గ్రామంలో పూర్తి అయిన గోకులం షెడ్

ఎర్రగొండపాలెం రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మూగ జీవాలకు నీడను కల్పించేందుకు ప్రభుత్వం గోకులం షెడ్లను గ్రామాల్లో నిర్మిస్తోంది. ఉపాధి హామీ పథకం కింద ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసింది. ప్రతి మండలానికి లక్ష్యం నిర్ణయించి మరీ షెడ్లను నిర్మించి ప్రారంభించారు. అయితే ఫిబ్రవరి పూర్తి నాటికి ఆ నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తి చేశారు. అప్పటి నుంచి నిధుల విడుదలలో జాప్యం జరిగింది. ఎట్టకేలకు మూడు రోజుల కిందట పెండింగ్‌లో ఉన్న ప్రతి వాటికి బిల్లులు పడ్డాయి. ఎర్రగొండపాలెం నియోజకవర్గ వ్యాప్తంగా 123 గాను 104 పూర్తి కాగా, సుమారు రూ. కోటీ 36లక్షలకు పైగా నిధులు విడుదలయ్యాయి.

ఎర్రగ్రొండపాలెం మండలంలో మొత్తం 36 గోకులం షెడ్లకు 24 పూర్తయ్యాయి. రూ.28లక్షల782 నిధులు మంజూరయ్యాయి. త్రిపురాంతకం మండలంలో మొత్తం 22 గోకులంషెడ్లకు గాను 22 పూర్తికాగా, రూ.24లక్షల87వేల991, పెద్దరావీడు మండలంలో మొత్తం 25కిగాను 23 పూర్తికాగా రూ.37లక్షల 6621, పుల్లలచెరువు మండలంలో మొత్తం 23కుగాను 21 పూర్తికాగా, రూ.30లక్షల89వేల85, దోర్నాల మండలంలో మొత్తం 17 గోకుల షెడ్లకు గాను 14 పూర్తి కాగా, రూ.15లక్షల 28వేల61 రూపాయల నిధులు వచ్చినట్లు ఉపాధి పథకం ఏపీడీ నిర్మలాదేవి తెలిపారు. బిల్లులు రావడంపై నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా రంగస్వామి కల్యాణం

రాచర్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేపీచెరువు అడవుల్లో వెలసిన నెమలిగుండ్ల రంగనాయక స్వామి కల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. అర్చకస్వా ములు అన్నవరం సత్యనారాయణ చార్యులు భూమరాజు సాయి వంశీ కల్యాణ కార్యక్రమాన్ని జరిపించారు. కల్యాణ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు కూడా జరిగాయి. స్వామి వారి దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.నాగయ్య, సిబ్బంది అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఆలయంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు బలిజ సత్రంలో భక్తులకు ఆలయ నిర్వాహకులు కన్నసాని గోపాల రావు, తోట చంద్రయ్య అన్నదాన వసతులను కల్పించారు.



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ముఖాముఖి

సబ్సిడీపై యంత్రపరికరాలు

బి.ప్రసాదరావు, ఏవో తాళ్లూరు



ప్రశ్న: వ్యవసాయ యాంత్రిక పథకం కింద ఏఏ పరికరాలు అందజేశారు?

జవాబు: తైవాన్ స్ప్రేయర్లు, నాగళ్లు, గొర్రులు, స్ప్రింకర్లు, టార్పాలిన్ పట్టలు, పైపులు సబ్సిడీపై రైతులకు అందజేశాం.

ప్ర: భూసారపరీక్షల ద్వారా రైతులకు జరిగే ప్రయోజనమేంటి?

జ: భూసార పరీక్షలు చేయించుకోవటంవల్ల భూమిలో ఎటువంటి ధాతు లోపం ఉందో తెలుస్తుంది. దానిని బట్టి ఎంత మోతాదులో ఎరువులను ఉపయోగించుకోవాలో తెలుసుకోవడం వల్ల వ్యవసాయఖర్చులు తగ్గుతాయి.

ప్ర: పొలం పిలుస్తుంది కార్యక్రమం వల్ల రైతులకు ఏం ప్రయోజనం?

జ: వ్యవసాయశాఖ అనుసంధానమైన పలుశాఖల అధికారులు రైతులు సాగుచేస్తున్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. దీనిద్వారా రైతులు సస్యరక్షణ చర్యల గురించి తెలుసుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతున్నది.

ప్ర: తాళ్లూరు మండలంలో ఏఏ పంటలు సాగు చేస్తారు?

జ: వరి, కంది, మొక్కజొన్న, మిరప, పొగాకు, సజ్జ, ఉద్యాన వనపంటలైన బత్తాయి, జామ, మామిడి, సీతాఫలం, కరివేపాకు సాగు చేస్తున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పామూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్ అన్నారు. శనివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో గంగసాని హుసేన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించారని అన్నారు. సమావేశంలో కె.రామిరెడ్డి, షేక్ చాంద్‌బాషా, జి.భాస్కరరెడ్డి, వైవీ సాయికిరణ్, జె.గోవిందయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సాయం

పామూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): మానవతా సేవా సంస్థ తరుపున పలువురు బాధితులకు వైద్య అవసరాల కోసం రూ.20 వేలు అందజేసినట్టు సంస్థ అధ్యక్షుడు ఎం.ముసలయ్య తెలిపారు. శనివారం పేద విద్యార్థిని నల్లబోతుల లక్ష్మీప్రణవికి సైకిల్ అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఏల్చూరి సత్యనారాయణకు రూ.5 వేలు, శ్రీరాం మధుసూదన్‌కు రూ.5 వేలు, ఇంజనీరింగ్ చదువుతున్న వీసీపల్లికి చెందిన పి.రమ్యకు రూ.5 వేలు ఆర్థికసాయం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ కె.రామిరెడ్డి, కార్యదర్శి ఎన్.బాబురావు, కోశాధికారి టి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ దాడులు

దొనకొండ, జూలై 12(ఆంధ్రజ్యోతి): బెల్ట్‌షాపులపై దర్శి ఎక్సైజ్ సీఐ కె.శ్రీనివాసరావు నేతృత్వంలో శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో దొనకొండ గ్రామానికి చెందిన చలమయ్య అక్రమంగా నిల్వ ఉంచిన 18 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలో ఏ గ్రామంలోనైనా అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ వీఆర్ సత్యనారాయణ, సిబ్బంది శ్రీనివాసరావు, నాగరాజు పాల్గొన్నారు.

16న దర్శిలో జాబ్ మేళా

దర్శి, జూలై 12(ఆంధ్రజ్యోతి): స్థానిక గౌతమీ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈనెల 16న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు గౌతమీ విద్యా సంస్థల చైర్మన్ కె.గుండారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో 32 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థిక బకాయిలు చెల్లించాలి

ఒంగోలు విద్య, జూలై 12(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ కీర్తి, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి.వెంకటరావు, లక్ష్మీనారాయణ, ప్రతినిధులు వై.శ్రీనివాసులు, ఎ.అమ్మయ్య, బి.అశోక్‌కుమార్, ఎం.రాఘవరావు, పీవీ సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నాలుగు పెండింగ్ డీఏలు పెండింగ్‌లో ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. గత రెండేళ్ల నుంచి పీఆర్సీ కమిటీ వేయకపోవడం, ఐఆర్ ప్రకటించకపోవడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉద్యోగులు దాచుకున్న రూ.25,700 కోట్ల బకాయిలను ఇంతవరకు చెల్లించలేదన్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

» నిర్వీర్యం అవుతున్న ఇరిగేషన్ శాఖ

» ఏళ్ల తరబడి పోస్టులు ఖాళీ



దర్శి, జూలై 12(ఆంధ్రజ్యోతి): సిబ్బంది కొరతతో ఇరిగేషన్ శాఖ నిర్వీర్యం అవుతుంది. ఏళ్ల తరబడి అధికశాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో పనులన్నీ మూలనపడ్డాయి. ప్రధానంగా దర్శి ఎన్ఎస్‌పీ డివిజన్ పరిధిలో పోస్టుల ఖాళీలు చూస్తే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థమవుతుంది. మొత్తం 16 మంది ఏఈఈ పోస్టులు ఉండగా ఆరుగురు మాత్రమే పనిచేస్తున్నారు. మిగిలిన పది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 22 మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు పనిచేయాల్సి ఉండగా కేవలం ఏడుగురు మాత్రమే అందుబాటులో ఉన్నారు. మిగిలిన 15 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 105 మంది లస్కర్లు పనిచేయాల్సి ఉండగా కేవలం 14 మంది మాత్రమే ఉన్నారు. 101 లస్కర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

చీమకుర్తి డివిజన్ పరిధిలోని దర్శి-2 సబ్ డివిజన్‌లో నలుగురు ఏఈఈలు పనిచేయాల్సి ఉండగా కేవలం ఒక్కరు మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఐదుగురు వర్క్ ఇన్‌స్పెక్టర్లకు ఇద్దరు మాత్రమే ఉన్నారు. 36 మంది లస్కర్ల పోస్టులు ఉండగా, ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఏళ్ల తరబడి ఈ ఖాళీ పోస్టులు భర్తీకి నోచుకోలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పోస్టులు భర్తీకి చేయకపోగా, సాగర్ కాలువల మరమ్మతుల గురించి పట్టించుకోలేదు. దీంతో ప్రధాన కాలువతో పాటు బ్రాంచ్ కాలువలు, మేజర్లు, మైనర్లు అధ్వానంగా మారాయి. చిల్లచెట్లు మొలచి చిట్టడవులను తలపిస్తున్నాయి. గతంలో లస్కర్లు పూర్తిస్థాయిలో పని చేసినప్పుడు కాలువ కట్టలపై పెరిగిన చిల్లచెట్లను ఎప్పటికప్పుడు తొలగించుకునేవారు. ప్రస్తుతం ఆ వ్యవస్థ నిర్వీర్యమైంది.

టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సాగునీటి ప్రాజెక్టులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారు. అందులోభాగంగా కాలువల మరమ్మతులకు నిధులు విడుదల చేయటంతో ప్రస్తుతం చిల్లచెట్లు తొలగిస్తున్నారు. ఈఏడాది శ్రీశైలం డ్యామ్‌లో ఇప్పటికే నీరు నిండింది. సాగర్ జలాశయంలో వరద నీరు చేరుతుంది. ఈక్రమంలో సాగునీరు సకాలంలో విడుదలచేసే అవకాశం ఉంది. అధికారుల అంచనా ప్రకారం ఆగస్టు మొదటి వారంలో సాగునీరు విడుదల చేసే అవకాశం ఉంది. ఈలోగా మరమ్మతులు పూర్తయితే కాలువలు కొంతమేరకు మెరుగుపడతాయి. సాగునీటిని అన్నిప్రాంతాలకు సక్రమంగా పంపిణీ చేసేందుకు సిబ్బంది కొరతను తీర్చాల్సిన అవసరం ఉంది. చివరి భూములకు నీరు అందించాలంటే వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లస్కర్లు పూర్తిస్థాయిలో భర్తీ చేయాలి. కూటమి ప్రభుత్వం ఇరిగేషన్ శాఖలోని పరిస్థితిని గుర్తించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేసి ఆయకట్టు భూములకు సక్రమంగా నీరందేవిధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అక్రమంగా తెల్లరాయి తవ్వకాలు

» పంచాయతీ అనుమతులు లేకుండా అడ్డగోలుగా వ్యవహారం

» అధికారులకు ఫిర్యాదుచేసిన గ్రామస్థులు


పంచాయతీ అనుమతి లేకుండా ప్రభుత్వ భూమిలో తవ్వకాలు

పామూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా తెల్లరాయి(క్వార్జ్) కోసం అక్రమంగా తవ్వకాలు చేస్తున్నారు. అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదుచేసినా అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. పామూరు మండలం అయ్యవారిపల్లి రెవెన్యూ పరిధిలోగల కోడిగుంపల గ్రామ పంచాయతీ సర్వేనెంబర్ 462లో పది ఎకరాల ప్రభుత్వ భూమిలో తెల్లరాయి తవ్వకాల కోసం మైనింగ్ శాఖ నుంచి కొందరు అనుమతులు పొందారు. అయితే, గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి పాలకుల ఒత్తిడి మేరకు రెవెన్యూ అధికారులు కోడిగుంపల పంచాయతీ అనుమతులు తీసుకోకుండానే రెవెన్యూ గ్రామమైన అయ్యవారిపల్లి గ్రామ పంచాయతీలో 2021లో తీర్మానాలు పొందారు. భూమి ఉన్న కోడిగుంపల గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా తవ్వకాలను ప్రారంభించారు. మైన్ కోసం 2015లోనే కొందరు దరఖాస్తు చేసుకోగా, వాటిని మైనింగ్ శాఖ తిరస్కరించింది. ఈ ఆక్షన్‌ద్వారా అనుమతులు తీసుకొన్న సంస్థ ప్రభుత్వ మారడంతో మరో కంపెనీకి లీజ్‌కు ఇచ్చారు. నకిలీ డాక్యుమెంట్‌తో కడప ప్రాంతానికి చెందినవారు తమకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయని గ్రామస్థులను బెదిరిస్తూ తవ్వకాలు చేపట్టి తెల్లరాయిని తరలిస్తున్నారు.

ఈవిషయంపై పలుమార్లు రెవెన్యూ ఉన్నతాధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో రెండు రోజుల క్రితం పామూరు తహసీల్దార్ తన సిబ్బందితో మైనింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించి తవ్వకాలను నిలిపివేయించారు. అనుమతుల పత్రాలను తీసుకొని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో కలవాలని ఆదేశించారు. దాంతో ప్రస్తుతం తవ్వకాలు నిలిచిపోయాయి. మైనింగ్ శాఖ నిబంధనల ప్రకారం గ్రామానికి కిలోమీటర్ దూరంలో బ్లాస్టింగ్ చేయాలి. వేస్ట్ మెటీరియల్‌ను అనుమతులు పొందిన స్థలంలోనే వేయాలి. అయితే, అడ్డగోలుగా రోడ్డు నిర్మించి వేస్ట్ మెటీరియల్‌ను ఎక్కడబడితే అక్కడ ప్రభుత్వ భూమిలో పడవేస్తున్నారు. దీంతో కొండల నుంచి వచ్చే వర్షపు నీరు ఫీడల్ చానెల్స్‌లో వేస్ట్ మెటీరియల్స్ వేయడం ద్వారా నీరు ప్రవహించక సమీపంలోని నాగయ్యకుంట ఎండిపోయింది. దాంతో జీవాలకు నీరు, మేతలేక అల్లాడుతున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూశాఖ ఉన్నాతాధికారులు స్పందించి నిబంధనలకు వ్యతిరేకంగా జరుగుతున్న తవ్వకాలను నిలిపివేసి న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.


నీరురాక ఎండిపోయిన నాగయ్య కుంట

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం


పామూరు: కంబాలదిన్నెలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న పువ్వాడి వెంకటేశ్వర్లు

పామూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాల మేరకు శనివారం మండలంలోని కంబాలదిన్నె గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెన్షన్‌ల పెంపు, తల్లికి వందనం, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. పథకాల అమలుతీరు గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, చుంచు కొండయ్య, గోళ్ల భాస్కరరావు, గోళ్ల రమణయ్య, మన్నం రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, మండలంలోని చింతలపాలెం గ్రామంలో, పామూరు పట్టణంలోని 270, 274, 275, 276 బూత్‌ల పరిధిలో సుపరిపాలన కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఉప్పలపాటి హరిబాబు, ఎన్.సాంబయ్య, మెంట నరసింహారావు, ఎన్.నాగేంద్రచారి, ఇర్రి శ్రీనివాసులురెడ్డి, ఇల్లూరి రామిరెడ్డి, ఎం.వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి: ఏడాది కాలంలోనే ప్రజలకు సుపరిపాలన అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే సాధ్యమైందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి అన్నారు. పట్టణంలో 146వ బూత్ పరిధిలో శనివారం ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి కనిగిరిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారన్నారు. కార్యక్రమంలో షేక్ ఫిరోజ్, బుల్లా బాలబాబు, కొబ్బరిబొండాల సుబ్బారావు, పచ్చవ శేఖర్, నారాయణ, తాతపూడి జాన్సన్, తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి: ఇంటింటికీ సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అందిస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య అన్నారు. మండలంలోని నేలపాటిపల్లి గ్రామంలో శనివారం రాత్రి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంచర్ల వెంగయ్య, రామారావు, బద్దిపూడి ఎబినేజరు, పులి ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా కర్ర తరలింపు

» పిల్లివారిపల్లి చెరువు భూముల్లో జామాయిల్ నరికివేత

» పట్టించుకోని అధికారులు


తరలింపునకు సిద్ధంగా ఉన్న జామాయిల్ కర్రలు

పీసీపల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): కర్ర వ్యాపారులు రెచ్చిపోతున్నారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో ఉన్న వృక్ష సంపదను అడ్డంగా నరికి టన్నులకొద్దీ కలపను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బ్యారన్ సీజన్‌లో కలపకు అధికంగా డిమాండ్ ఉంటుంది. ఆ సమయంలో కలప ధర అధికంగా ఉంటుంది. సీజన్‌కు ముందుగానే కర్రను కొట్టి నిల్వ చేసుకుంటే సీజన్‌లో అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేందుకు కర్ర వ్యాపారులు ఈ ఏడాది ఉందుగానే కర్ర కొట్టిస్తున్నారు. రైతుల పొలాల్లో ఉన్న కర్రను కొనాలంటే అధిక ధరలు చెల్లించాల్సి వస్తుందని కొందరు వ్యాపారుల కన్ను ప్రభుత్వ భూముల్లో ఉన్న వృక్ష సంపదపై పడింది. అధికారుల అనుమతి లేకుండా ఎటువంటి రాయితీలు చెల్లించకుండా గ్రామాల్లోని కొంతమంది వ్యక్తులకు నగదు ముట్టచెప్పి ప్రభుత్వ భూముల్లో ఉన్న కలపను కొట్టి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

మండలంలోని పిల్లివారిపల్లి గ్రామ పరిధిలోని ఇరిగేషన్ చెరువు భూమిలో దశాబ్దం క్రితం నాబార్డు నిధులతో సుమారు 15ఎకరాల విస్తీర్ణంలో జామాయిల్ సాగుచేశారు. ఈక్రమంలో గ్రామానికి చెందిన కొంతమంది కందుకూరు నియోజకవర్గానికి చెందిన కొందరు కర్ర వ్యాపారులతో మాట్లాడి కేవలం 1.20లక్షలకే బేరం కుదుర్చుకుని విక్రయించినట్లు తెలిసింది. కర్ర కొన్న వ్యాపారులు జామాయిల్ చెట్లను కొట్టడం మొదలుపెట్టారు. ఇది తెలుసుకున్న గ్రామానికి చెందిన మరికొంతమంది అక్రమంగా జామాయిల్ చెట్లను కొట్టడాన్ని అడ్డుకోగా, తాము గ్రామానికి కొంత నగదు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నాకే జామాయిల్ చెట్లను కొడుతున్నామని చెప్పారు. తిరిగి చెట్లను నరికి లోడ్ చేసుకుని తరలించే క్రమంలో గ్రామానికి చెందిన కొంతమంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చెరువు వద్దకు వెళ్లగా అక్కడ జామాయిల్ కర్రను రెండు ట్రాక్టర్లకు కూలీలు లోడ్ చేస్తున్నారు. పోలీసులు అడ్డుకొని ట్రాక్టర్లను పీసీపల్లికి తరలించారు.

ఈవిషయాన్ని ఇరిగేషన్ అధికారులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. సమాచారం ఇచ్చి రెండు రోజులైనా సంబంధిత శాఖ అధికారులు పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయలేదని తెలిసింది.

జామాయిల్ కర్ర విషయమై పీసీపల్లి ఎస్సై జి.కోటయ్యను వివరణ కోరగా.. అక్రమంగా జామాయిల్ కర్రను కొడుతున్నారని తమకు ఫోన్ ద్వారా సమాచారం వచ్చిందని చెప్పారు. చెరువు ప్రాంతానికి వెళ్లి అక్రమంగా జామాయిల్ కొట్టడాన్ని నిలిపివేయించామన్నారు. ఈవిషయమై రిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చామని, ఇప్పటివరకు ఎవరూ రాతపూర్వకంగా ఫిర్యాదుచేయలేదని తెలిపారు.

ఇరిగేషన్ ఏఈఈ రామక్రిష్ణను వివరణ కోరగా పోలీసుల నుండి సమాచారం వచ్చిందని తెలిపారు. ఫీల్డ్‌లోకి వెళ్లి పరిశీలించి తమ పరిధిలోని భూమి అని నిర్ధారణ అయితే అక్రమంగా కర్ర కొట్టిన వ్యక్తులపై ఫిర్యాదుచేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

బాలికలు కష్టపడి ఉన్నతస్థాయికి చేరుకోవాలి

కనిగిరి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బాలికలు కష్టపడి ఉన్నతస్థాయికి చేరుకోవాలని మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాలలో శనివారం బాలికా విద్యపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాకిస్తాన్‌కు చెందిన మలాల యూసఫ్‌జాయ్ అనే యువతి బాలికా విదాభివృద్ధికి ఎనలేని కృషి చేసి తమ ప్రాణాలమీదకు తెచ్చుకుందన్నారు. పాకిస్తాన్‌లో మహిళలెవరూ విద్యను అభ్యసించరాదనే నిబంధనను లెక్కచేయకుండా మలాల విద్యనభ్యసిస్తుండటంతో ఉగ్రవాదులు తుపాకితో కాల్చారన్నారు. ప్రాణాలతో బయటపడిన ఆ యువతి తిరిగి బాలికా విద్యకోసం, బాలల, మానవ హక్కుల కోసం ఎనలేని కృషి చేస్తుందన్నారు. దీంతో ఆమెకు ఐక్యరాజ్యసమితి నోబెల్ పురస్కారం ఇచ్చి సత్కరించిందన్నారు. ఆమె పుట్టిన రోజును పురస్కరించుకుని 14 ఏళ్ళుగా మలాల దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు వివరించారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని బాలికలు విద్యలో రాణించాలన్నారు. విద్య ద్వారానే బాలికల సాధికారత సాధ్యమవుతుందన్నారు. బంగారుబాల్యం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎన్నో పథకాలు అందజేస్తుందన్నారు. ఆయా పథకాలను అందిపుచ్చుకుని బాలికలు విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారిణి చంద్రకుమారి, రమేష్‌బాబు, గందం శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పామూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ అదుపుతప్పి మహిళ మృతి చెందిన ఘటన శనివారం పామూరు వద్ద జాతీయరహదారిపై చోటుచేసుకుంది. ఎస్ఐ టి.కిశోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. సీఎస్‌పురం మండలం కంభంపాడు గ్రామానికి చెందిన మేకల అంజమ్మ(49) కూలీ పనులకు వెళుతుంది. ఈక్రమంలో పామూరు మండలంలోని తిరగళదిన్నె నుంచి ఇసుక లోడుతో ట్రాక్టర్‌పై పామూరుకు వస్తున్నారు. ఈక్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి సమీపంలోని పొలాల్లోకి దూసుకెళ్లగా అంజమ్మ కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త 12 సంవత్సరాల క్రితమే మృతి చెందాడు మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారులిద్దరూ తెలంగాణ రాష్ట్రంలో బేల్దారి పనులు చేస్తున్నారు. మృతురాలి తమ్ముడు వసంతరావు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్టు తెలిపారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం


విద్యార్థులకు ఆర్థికసాయం అందజేస్తున్న మాజీమంత్రి కాశిరెడ్డి దంపతులు

వెలిగండ్ల, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రతిభచూపిన విద్యార్థులకు మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి ఆర్థికసాయం చేశారు. శనివారం మండలంలోని ఇమ్మడిచెరువు జడ్పీహైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో కాశిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించి ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించిన నలుగురు విద్యార్థులను సన్మానించి, ఒక్కొక్కరికి రూ.పది వేల నగదును అందజేశారు. ఈసందర్భంగా కాశిరెడ్డి మాట్లాడుతూ ఉన్నత చదువుల కోసం ఆర్థికస్థోమతలేదని బాధపడొద్దన్నారు. తన దృష్టికి తీసుకొస్తే ఆర్థికంగా అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గుంటక తిరుపతి రెడ్డి, జయరామిరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ప్రసాద్, వరలక్ష్మి, ఇందిర, నాగేశ్వరావు, కృష్ణయ్య, చంద్రకళ, సుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కరుణించని వరుణుడు

» వాడిపోతున్న పత్తి » ఆందోళన చెందుతున్న రైతులు


వర్షం కురవక వాడుముఖం పట్టిన పత్తి

దొనకొండ, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ సాగు కష్టంగా మారింది. ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకుంటూ ఊరించిన మేఘాలు కొద్దిసేపటికే కనుమరుగవుతున్నాయి. మేఘాలు రైతులకు ఊరిస్తున్నాయే తప్పా సరైన వర్షం మాత్రం కురిపించటం లేదు. గత కొద్ది రోజులుగా ఇదే తంతు జరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది మే నెలలో వర్షాలు కురిసి రుతుపవనాలు ప్రవేశించాయి. ఈ ఏడాది వర్షాలకు కొదవ ఉండదని ఎంతో ఆశపడిన కొందరు రైతులు పత్తిపంటను సాగు చేశారు. అనంతరం వరుణుడు ముఖం చాటేయటంతో ఇటీవల ఎండలకు, ఈదురు గాలులకు సాగుచేసిన పంట వాడుముఖం పడుతుంది.

మండలంలో సాగు విస్తీర్ణం ఆరువేల హెక్టార్లు కాగా, జూన్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు 150 హెక్టార్లల్లో పత్తి పంట సాగుచేశారు. అనంతరం చినుకురాలక రైతులు ఆందోళన చెందుతున్నారు. పైరును కాపాడుకొనేందుకు పొలాల్లో బోర్లు ఉన్న రైతులు తడులు పెడుతున్నారు. వర్షాలు కురవకపోతే ఖరీఫ్‌లో కష్టాలు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వసతులులేక విద్యార్థినుల ఇబ్బందులు

తాళ్లూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరులోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలోని మరుగుదొడ్లు పూడిపోయి అపరిశుభ్రంగా ఉండటంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విద్యాలయంలో 230 మంది బాలికలు విద్యనభ్యశిస్తున్నారు. వీరు స్నానాలు, కాలకృత్యాలు తీర్చుకునేందుకు పైఅంతస్తు, కింది అంతస్తుల్లో దాదాపు 30కు పైగా నిర్మించారు. దీంతో బాలికలు ఇబ్బంది లేకుండా ఉండేది. ఇటీవల కొన్ని మరుగుదొడ్లు పూడిపోయి అపరిశుభ్రంగా ఉన్నాయి. ప్రస్తుతం 8 మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. మిగిలినవి పూడిపోయాయి. దీంతో బాలికలు కాలకృత్యాలు తీర్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడున్నారు. నిధుల కొరతతో మరుగుదొడ్ల మరమ్మతులు చేసేందుకు అధికారులు జాప్యం చేస్తున్నట్లు తెలుస్తుంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు జరిపి వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థినులు కోరుతున్నారు.

సాయిబాబా దేవస్థానికి విరాళం

పామూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత పోస్టాఫీసు ఎదురుగల షిరిడి సాయిబాబా మందిరంలో ప్రతి గురువారం జరిగే అన్నదాన కార్యక్రమానికి నెల్లూరుకు చెందిన కోట సత్యనారాయణ, లక్ష్మీకుమారి దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారని దేవస్థాన చైర్మన్ పబ్బతి వెంకటసుబ్బయ్య తెలిపారు. దాతల ఆర్థిక సహాయ సహకారాలతో గురుపౌర్ణమి సందర్భంగా నిర్వహించిన మహాఅన్నదాన కార్యక్రమం విజయవంతమైందని ఆయన తెలిపారు.





కలెక్టర్ జె.వెంకటమురళి

పొగాకు కొనుగోళ్లు వేగవంతం

- కొత్తగా 12 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- ప్రైవేట్ వ్యక్తులు విక్రయిస్తే క్రిమినల్ చర్యలు
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులు నిరుత్సాహ పడకుండా కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటమురళి అధికారులను ఆదేశించారు. కొనుగోళ్లపై శనివారం కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. రైతులు అపోహలకు లోనుకాకూడదని, సరైన సమాచారం కోసం మండల, జిల్లా స్థాయి అధికారులను సంప్రదించాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఆరు కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉండగా 14న చిన్నగంజాం, మార్టూరు, అడుసుమల్లి, 16న సంతమాగులూరు, తమ్మవరంలో ఒక్కోటి చొప్పున ఐదు కొనుగోలు కేంద్రాలను కొత్తగా ప్రారంభిస్తామన్నారు. ఆపై వారంలో మరో 7 కేంద్రాలను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో స్టాక్ నిల్వ సమస్యలు తలెత్తకుండా తగిన గిడ్డంగులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో 24 గంటల భద్రతకు సీసీకెమెరాల ఏర్పాటుతోపాటు రెవెన్యూ, పోలీసు పర్యవేక్షణ తప్పనిసరి అని తెలిపారు. రైతుల నుంచి ప్రైవేట్ వ్యక్తులు పొగాకు కొనుగోలు చేసి ప్రభుత్వానికి విక్రయిస్తే క్రిమినల్ చర్యలు తప్పవన్నారు. అలాంటి చర్యలకు పాల్పడే అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టెలీకాన్ఫరెన్స్‌లో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, మార్క్‌ఫెడ్ డీఎమ్ కరుణశ్రీ, జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ, మార్కెటింగ్‌శాఖ ఏడీ రమేష్, ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జమలో.. జాప్యం

గతంలో ఎన్నడూ లేనివిధంగా బర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొంటున్నది. ఇంతవరకు బాగానే ఉన్నా ఖాతాల్లో నగదు జమ కాకపోవడంతో రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం రంగంలోకి దిగి పొగాకును కొనడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నా డబ్బుల జమ విషయంలో జాప్యం జరుగుతుండటంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పర్చూరు మార్కెట్‌యార్డులో కొనుగోలు కేంద్రం వద్ద రైతుల రద్దీ (ఫైల్ ఫొటో)



- బర్లీ రైతులకు రూ.29 కోట్లు బకాయి
- గత నెల 19 నుంచి మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు
- ఆర్థికశాఖ అనుమతులు పెండింగ్‌తో రైతుల ఎదురుచూపు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో జూన్ 19 నుంచి బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలను ప్రత్యేకంగా మార్క్‌ఫెడ్ ప్రారంభించింది. ఇప్పటి వరకు 2,600 టన్నుల పొగాకును రైతుల నుంచి సేకరించింది. ఇందుకు సంబంధించి బాపట్ల జిల్లాలో 680 మంది, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 453 మంది రైతులకు మార్క్‌ఫెడ్ సుమారు రూ.29 కోట్లు చెల్లించాల్సి ఉంది. కానీ నగదు జమ విషయంలో రైతులకు మూడు వారాలుగా ఎదురుచూపులు తప్పడం లేదు. బర్లీ పొగాకు కొనుగోళ్ల కోసంగా ప్రభుత్వం రూ.273.17 కోట్లను కేటాయించగా తక్షణమే రూ.100 కోట్లు విడుదలకు మంత్రివర్గం జూన్ 25న పచ్చజెండా ఊపింది. ఈ ప్రకటన తర్వాత తమ ఖాతాల్లో డబ్బులు వెంటనే పడతాయని పొగాకు రైతులు ఆశలు పెట్టుకున్నారు. కానీ ఆర్థిక శాఖ నుంచి అనుమతులకు క్లియరెన్స్ లభించకపోవడంతో రైతుల ఖాతాల్లో నగదు జమలో జాప్యం జరుగుతుందని మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. మరో వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమవుతాయని చెబుతున్నా రైతుల్లో మాత్రం గందరగోళం నెలకొంది

అదనంగా మరికొన్ని కేంద్రాలు..

బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో బర్లీ పొగాకును జూన్ 19 నుంచి మార్క్‌ఫెడ్ కొనడం ప్రారంభించింది. ఈ క్రాప్ చిక్కులతో పాటు ఫోన్ మెసేజ్‌లపై రైతులకు అవగాహన లేకపోవడంతో ఆరంభంలో ఓ వారం కొనుగోళ్లు మందకొడిగా సాగాయి. సాంకేతిక చిక్కులు కొలిక్కి రావడంతో పాటు రైతులకు నిర్దేశించిన సమయంలోనే ఫోన్ మెసేజ్ ఆధారంగా పొగాకును కేంద్రాలకు తీసుకు వస్తుండడంతో కొనుగోళ్లు గాడిన పడ్డాయి. ఇప్పటి వరకు 2,600 టన్నులను మార్క్‌ఫెడ్ సేకరించింది. అయితే కొనుగోళ్ల కేంద్రాల వద్ద రద్దీ పెరగడంతో అదనంగా కేంద్రాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్లు రైతుల నుంచి పెద్దఎత్తున వస్తున్నాయి. ఈ విషయాన్ని బర్లీ రైతులు ఇటీవల పంగలూరులో మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అదనంగా మరి కొన్ని కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ సోమవారం ప్రారంభించనున్నది.

రెండు నెలల పాటు కొనుగోలు కేంద్రాలు

ఈ సీజన్‌లో కంపెనీలు దాదాపు 2600 టన్నుల పొగాకు కొనుగోలు చేసినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. నాలుగు జిల్లాల పరిధిలో రైతుల వద్ద ఇంకా దాదాపు 35,000 టన్నుల పొగాకు నిల్వ ఉన్నట్లు యంత్రాంగం చేపట్టిన క్షేత్రస్థాయి సర్వేలో తేలింది. సగటున రోజుకు 600 టన్నుల పొగాకు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసినా ఇంకా రెండు నెలల పాటు మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు చేపట్టాల్సి ఉంది.

ముళ్లచెట్లు తొలగింపు..

పార్కుకు ప్రతిపాదనలు

- సుందరవనంలో కంపోస్ట్ యూనిట్ ఆలోచన విరమణ
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన మున్సిపల్ అధికారులు

బాపట్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో మున్సిపల్ స్థలంలో మొక్కలు నాటి సుందరవనంలా మార్చాలని తొలుత ప్రయత్నించిన అధికారులు మధ్యలో విస్మరించారు. చివరకు ఆ ప్రాంతంలోని హైవే పక్కనే ఉన్న ఎకరం 9 సెంట్ల భూమిని ముళ్ల చెట్లతో చిట్టడవిలా మార్చేశారు. ఇక్కడ వర్మికంపోస్టు యూనిట్ స్థాపనకు ప్రయత్నించారు. ఈ క్రమంలో 'మొక్కలు నాటారు.. సంరక్షణ మరిచారు.. ముళ్ళచెట్లతో చిట్టడవిని తలిపిస్తున్న సుందరవనం' అంటూ ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి జిల్లా అధికారులు మున్సిపల్ స్థలాన్ని తీసుకుని మొక్కలు నాటారు. ఆ తర్వాత వాటిని సంరక్షించకుండా వదిలేశారు. దీంతో ఆప్రాంతంలో మంతా పిచ్చిమొక్కలు, ముళ్లచెట్లు పెరిగి సుందరవనం చిట్టడవిగా మారింది. ఈ క్రమంలో జిల్లా అధికారుల ఆదేశాలతో ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలను మున్సిపల్ అధికారులు తొలిగించి శుభ్రం చేయించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సూచనల మేరకు ఇక్కడ పార్క్, వాకింగ్‌ట్రాక్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రీన్ కార్పొరేషన్‌కు ప్రతిపాదనలు పంపించినట్లు కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. రూ.25 లక్షలు వెచ్చించి ఆహ్లాదకరమైన పార్కును ఏర్పాటు చేస్తామని చెప్పారు. వర్మికం పోస్ట్ యూనిట్ ఏర్పాటు చేయాలనే ఆలోచన విరమించుకున్నామన్నారు.



శుభ్రం చేయక ముందు ముళ్ల చెట్లు, పిచ్చిమొక్కలతో ఉన్న ప్రాంతం



వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట చిట్టడవిని తలపిస్తున్న ప్రాంతాన్ని శుభ్రం చేస్తున్న ఎక్స్‌కవేటర్



జగనన్న మహిళా మార్ట్(ఫైల్ ఫొటో)

మెప్మా గాడిన పడేదెప్పుడో..

- ఏడాదిగా మహిళా మార్ట్ మూత
- ఇప్పటికీ సభ్యులకు పంచని వాటా ధనం
- సభ్యులకు తెలియకుండా రుణాలు పొందిన ఆర్పీలు
- విచారణ చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం

అద్దంకి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మెప్మా గాడిలో పడుతుందని భావించిన సభ్యులకు ఏడాదిగా నిరాశే మిగిలింది. అద్దంకిలో గతంలో ఏర్పాటు చేసిన జగనన్న మహిళా మార్ట్ మూత పడినా తమ వాటా ధనం కోసం ఏడాదిగా ఎదురుచూస్తున్నారు. 2022 ఫిబ్రవరి 3న అద్దంకిలో సుమారు 8 వేల మంది స్వయం సహాయక సంఘాల సభ్యుల నుంచి రూ.12 లక్షలు వసూలు చేసి జగనన్న మహిళా మార్ట్ ప్రారంభించారు. ఈ మార్ట్‌లో ఏటా వచ్చే ఆదాయాన్ని సభ్యులకు పంపిణీ చేస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. సుమారు 28 నెలలు మార్ట్ నిర్వహించారు. పెట్టుబడి పెట్టిన సభ్యులతోనే బలవంతంగా నిత్యావసర సరుకులను అధిక ధరలకు కొనుగోలు చేయించారు. వైసీపీ ప్రభుత్వం చివరలో మార్ట్ నిర్వహణ చూసే మెప్మా సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించి పెట్టుబడి నిధిని సొంత అవసరాలకు వినియోగించుకున్నారు. దీనిగురించి మెప్మా సభ్యులు ప్రశ్నించినా అప్పట్లో సమాధానం చెప్పలేదు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సభ్యులు మార్ట్‌లో అవినీతిపై మంత్రి రవికుమార్‌కు ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశించారు. మార్ట్‌లో లాభాలు చూపించకపోగా పెట్టుబడి నిధిలోనే నష్టాలు చూపించినట్లు విచారణ అధికారులు తేల్చారని సమాచారం. విచారణ జరిగి ఏడాది గడిచినా సభ్యులకు న్యాయం జరగలేదు. లాభాలు అటుంచి కనీసం పెట్టుబడి నిధి అయినా చెల్లించాలని సభ్యులు కోరుతున్నారు.

బ్యాంకు రుణాలు ఎగనామం..

మహిళా మార్ట్ పరిస్థితి ఈ విధంగా ఉంటే తమకు తెలియ కుండా తమ స్వయం సహాయక సంఘం పేరుతో బ్యాంక్‌లో ఆర్పీలు రుణం తీసుకుని నెలవారీ కిస్తీలు చెల్లించకుండా ఎగనామం పెడుతున్నట్లు పలువురు సభ్యులు ఆరోపిస్తున్నారు. గతంలో తీసుకున్న రుణం చెల్లించాము.. మళ్లీ రుణం ఇవ్వాలని ఓ స్వయం సహాయక సంఘ సభ్యులు బ్యాంక్‌కు వెళ్లగా బకాయి ఉన్నట్లు అధికారులు తెలిపారు. దీంతో వారు నిలదీయగా తప్పు ఒప్పుకుని విడతల వారీగా చెల్లించేందుకు ఆర్పీ అంగీకరించింది. అయితే నగదు చెల్లించకపోవడంతో ఆర్పీపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వారు సిద్ధమైనట్లు తెలుస్తుంది. మరికొన్ని గ్రూపుల సభ్యులను ఏమార్చి ఆర్పీలు రుణాలు తీసుకున్నట్లు సమాచారం. మరికొందరు ఆర్పీలు డమ్మీ గ్రూపులను నిర్వహిస్తూ బ్యాంకుల నుంచి రుణాలు పొందినట్లు ఆరోపణలున్నాయి. సమగ్ర విచారణ జరిపితే మెప్మాలో మరెన్నో అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్వయం సహాయక సంఘాల సభ్యులు చెప్తున్నారు.

గుడ్డు భోజనంతోనూ..

శిల్క్‌వ్యాపారి టోకరా

వెలుగు చూస్తున్న ఘరానా మోసగాడి లీలలు



రూ.49లకే గుడ్డు భోజనం అంటూ పర్చూరులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పర్చూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ ఆశచూపి పలువురిని ఆర్థికంగా దెబ్బతీసిన శిల్క్‌వ్యాపారి ఘరానా మోసాలు వెలుగుచూస్తున్నాయి. కొద్ది నెలల ముందు పోలీసు స్టేషన్‌కు సమీపంలోనే రూ.49కే గుడ్డు భోజ నంతో హోటల్ ప్రారంభించి మరి కొందరిని బురిడీ కొట్టించి అందిన కాడికి సొమ్ము చేసుకున్నాడని సమాచారం. రూ.49కే పలావు, కోడిగుడ్డు(భోజనం) అంటూ బోర్డుపెట్టాడు. వంటకాలు రుచికరంగా ఉండడం, ధర తక్కువ కావ డంతో జనాలు ఎగబడ్డారు. అప్ప టికే శిల్క్ చీరలను తక్కువ ధరకు ఇస్తుండటం, రూ.49కి గుడ్డుభోజనానికి ఆదరణ లభించడంతో అతడిపై ప్రజల్లో నమ్మకం మరింత పెరిగింది. ఈ క్రమంలోనే తాను రుణం కోసం ధరఖాస్తు చేశానని కొద్దిరోజుల్లో డబ్బులు వస్తాయని చెప్పి డబ్బులు తీసుకున్నట్లు బాధితులు చెబుతున్నారు. అతడికి డబ్బులు ఇచ్చినట్లు ఆధారాలు లేకపోవడం, ఏమిచే యాలో అర్థం కాక బాధితులు లబోదిబో మంటున్నారు. మోసగాడి గుట్టు బహిర్గతం కావడంతో పోలీసు అధికారులు సదరు నిం దితుడి వ్యవహారంపై దృష్టిసారించారు. ఘరానా మోసగాడితో సన్నిహితంగా ఉన్న తమ శాఖలోని వారి వివరాలు తెలుసుకునే ప్రయత్నంలో అధికారులు ఉన్నారు. ప్రస్తుతం పర్చూరులో మోసగాడి బాగోతం, బాధితుల ఆరణ్య వేదన చర్చనీయాంశంగా మారింది. ఈ మోసగాడికి నగదు ఇచ్చిన వారిలో పేదలే ఎక్కువమంది ఉన్నారు. బ్యాంకులో డ్వాక్రా రుణం తీసుకుని ఎక్కువ వడ్డీ ఆశతో మోస గాడికి ఇవ్వగా అతడు ప్రస్తుతం పరారీలో ఉండటంతో డ్వాక్రా మహిళలు కన్నీటి పర్యంతమ వుతున్నారు.

17న ఏఎన్‌యూ ఐసెట్

23న ఇంజనీరింగ్, 19 నుంచి పీజీ సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు భర్తీకి..

పెదకాకాని, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎంబీఏ కోర్సుల్లోని సెల్ఫ్ ఫైనాన్స్ కేటగిరి సీట్ల భర్తీకి ఈ నెల 17న ప్రవేశ పరీక్ష (ఏఎన్‌యూ ఐసెట్) జరుగుతుందని వర్సిటీ పీజీ ప్రవేశాల సంచాలకులు ఆచార్య పి.బ్రహ్మజీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఏఎన్‌యూ ఇంజనీరింగ్ కళాశాలలో డ్యూయల్ డిగ్రీ విధానంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఏఐ అండ్ మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్ కోర్సుల్లో సెల్ఫ్ ఫైనాన్స్ కేటగిరి సీట్ల భర్తీకి ఈ నెల 23న ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష జరుగుతుందని ఆయన తెలిపారు. ఏఎన్యూ ఐసెట్‌కు 120, ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షకు 200 మందికి పైగా విద్యార్థులు దరఖాస్తు చేశారని ఆయన వివరించారు. క్యాంపస్ కళాశాలల్లోని పలు పీజీ కోర్సుల సీట్ల భర్తీకి ఈ నెల 19 నుంచి పీజీ ప్రవేశ పరీక్షలు జరుగుతాయన్నారు. పూర్తి సమాచారం కోసం విశ్వవిద్యాలయంలోని పీజీ ప్రవేశాల కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన చెప్పారు. ఈ ప్రవేశ పరీక్షలు వర్సిటీలోని ప్రవేశాల కార్యాలయంలో జరుగుతాయని బ్రహ్మజీరావు పేర్కొన్నారు.

పుర కార్మికులు.. పోరుబాట

- మున్సిపల్ కమిషనర్లకు సమ్మె నోటీసు
- నేటి నుంచి సమ్మెలోకి కాంట్రాక్ట్ కార్మికులు
- 16 నుంచి పారిశుధ్య కార్మికుల నిరవధిక సమ్మె



బాపట్ల : ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

నేతలకు, అధికారులకు వినతిపత్రాలు.. వివిధ రూపాల్లో ఇప్పటి వరకు ప్రదర్శనలు, ధర్నాలతో నిరసన తెలిపిన మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు నిరవధికంగా పోరుబాటకు సిద్ధమయ్యారు. పురపాలక సంఘాల్లోని వివిధ విభాగాల కాంట్రాక్టు కార్మికులు ఆదివారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నారు. ఈ మేరకు మున్సిపాల్టీల్లో కమిషనర్లకు నోటీసులు కూడా అందజేశారు. సమస్యల పరిష్కారం కోసం అనేక రూపాల్లో ప్రభుత్వానికి విన్నవించినా పరిష్కారం కాని పక్షంలో నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు కార్మిక సంఘాల నేతలు తెలిపారు. జిల్లాలోని మూడు మున్సిపాల్టీలు, అద్దంకి నగర పంచాయతీలో కార్మికులు సమ్మెలోకి వెళ్లనున్నారు. దీంతో ఆయా మున్సిపాల్టీల్లో ప్రధానంగా తాగునీటి సరఫరాకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవనున్నాయి. ఇంజనీరింగ్, ప్రణాళిక విభాగం, పరిపాలన, నీటి సరఫరా తదితర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు తొలుత సమ్మె చేపట్టనున్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 16 నుంచి పారిశుధ్య కార్మికులు కూడా నిరవధిక సమ్మెకు సమాయత్తమవుతున్నారు. ఈ మేరకు సమ్మె విషయం గురించి సదరు కార్మికులు కమిషనర్లకు తెలిపారు. తమ డిమాండ్లను ప్రభుత్వం అమలు చేసే వరకు సమ్మె కొనసాగిస్తామని కార్మికులు స్పష్టం చేశారు. నరసరావుపేటలో కార్మికులు శనివారం ప్రదర్శన నిర్వహించారు.

ఇవీ కార్మికుల డిమాండ్లు..

మున్సిపాల్టీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు డిమాండ్లు ఇలా ఉన్నాయి.

- సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. జీవో 36 ప్రకారం జీతాలు రూ.21,000 నుంచి రూ.24,500లకు పెంచాలి.
- ఇంజనీరింగ్ కార్మికులను టెక్నికల్, నాన్ టెక్నికల్‌గా విభజించి జీతాలు చెల్లించాలి.
- గత 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలి.
- ఉద్యోగ విరమణ ప్రయోజనాలు పెంచాలి.
- తల్లికి వందనం తదితర ప్రభుత్వ పథకాలు అమలు చేయాలి.
- ఆప్కాస్‌ను రద్దు చేసి పర్మినెంట్ చేయాలి.
- వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచాలి.

అన్నదాతకు.. మేమూ అర్హులమే

- సుఖీభవ పథకానికి భారీగా దరఖాస్తులు
- ఫిర్యాదులకు నేటితో ముగియనున్న గడువు
- జిల్లాలో 4,900 మంది రైతుల ఈకేవైసీ పెండింగ్



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రైతులకు పెట్టుబడి సాయం అందించడం కోసం అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పీఎం కిసాన్ రూ.2,000, రాష్ట్రం రూ.5,000 కలిపి ఈ నెల 21న అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో జమ చేయనున్నది. రైతు సేవా కేంద్రాల్లో ముందస్తుగా అర్హులైన లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించారు. అర్హత ఉండి జాబితాలో పేరు లేని వారు అన్నదాత సుఖీభవ పోర్టల్‌లోని గ్రీవెన్స్ మాడ్యూల్లో ఫిర్యాదు చేయవచ్చని ప్రభుత్వం సూచించింది. ఇందుకు సంబంధించి గడువు ఆదివారంతో ముగియనున్నది. అర్హత ఉన్నా జాబితాలో తమ పేరు లేదని 1200 మంది రైతులు శనివారం వరకు దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం వరకు గడువు ఉన్నందున ఈ సంఖ్య 1,500 వరకు చేరే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈకేవైసీలో ఎదురవుతున్న సాంకేతిక చిక్కుల వల్ల పెద్ద సంఖ్యలో రైతులు ఈ పథకానికి దూరమయ్యే సూచనలు కనబడుతున్నాయి. మరో 3,400 మంది బయోమెట్రిక్ విషయంలో రైతులు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయని వీటిని మరో మూడు రోజుల్లో పూర్తి చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. 4,900 మంది రైతుల ఈకేవైసీ పెండింగ్‌లో ఉండగా 1,500 మంది రైతుల వేలిముద్రల విషయంలో సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వేళ్ల మీద ఉన్న రేఖలు చెరిగిపోవడం వంటి తదితర కారణాలతో ఈకేవైసీ జరగడం లేదు. వీరి విషయంలో ఐరిస్ లేదా ఫేస్ రికగ్నేషనే ప్రత్యామ్నాయమని కానీ ఇందుకు సంబంధించి ప్రభుత్వ నిర్ణయమే ఫైనల్ అని అధికారులు చెబుతున్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు అందించ డంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో వారు ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో 1,57,200 మంది అర్హులు

జిల్లా వ్యాప్తంగా 1,62,200 మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులుగా వ్యవసాయశాఖ గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఈకేవైసీ తదితర కారణాలతో 5,000 మంది రైతుల పేర్లను ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచింది. దీంతో జిల్లాలో 1,57,200 మంది రైతులను ప్రాథమికంగా అర్హులుగా ప్రభుత్వం తేల్చింది. జాయింట్ ఎల్‌పీఎంల ఇక్కట్ల విషయంలో ప్రభుత్వం వారం రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించడంతో పాటు, చెల్లించాల్సిన రుసుం విషయంలో రాయితీ కల్పించడం వల్ల దాదాపు 4,000 మంది రైతులకు అదనంగా లబ్ధి చేకూరినట్లైంది. జిల్లాలో తామూ అర్హులమేనని 1200 మంది రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వ ఆమోదం కోసం పంపామని అక్కడి నుంచి అనుమతి వస్తే వారు కూడా లబ్ధిదారుల జాబితాలో చేరతారని అధికారులు చెబుతున్నారు. రీ సర్వే శాపం కారణంగా జిల్లాలో దాదాపు 3,500 మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి దూరమయినట్లు తెలుస్తోంది.

అవీ..ఇవీ..

నేడు బల్లికురవలో మెగా వైద్యశిబిరం

బల్లికురవ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేడు ఆదివారం ఉదయం 9 గంటలకు నర్సారావుపేట తేజ నర్సింగ్ హోమ్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరానికి సుదీర్ఘ అనుభవం కలిగిన ఎముకలు, కీళ్ల నరాల వైద్య నిపుణులు డాక్టర్ బొట్ల రఘుప్రసాద్, స్త్రీల వ్యాధులు వైద్య నిపుణులు డాక్టర్ బొట్ల పార్వతి, డాక్టర్ కర్నాటి శ్రావణి, జనరల్ వైద్య నిపుణులు డాక్టర్ బొట్ల రంగతేజ వైద్యశిబిరానికి హజరు కానున్నారు. ఈ సందర్భంగా అన్ని రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను కూడా అందజేయనున్నారు.

రాతి మండప నిర్మాణానికి విరాళం


నగదు అందజేస్తున్న దాతలు

అద్దంకి, జూలై12 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం నిర్మాణానికి ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం శంకరాపురం గ్రామానికి చెందిన బొల్లినేని ఆదినారాయణ, కవిత దంపతులు శనివారం రూ.1,00,116లు అందజేశారు. దామా హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సృజన సాహిత్య సమావేశం

అద్దంకిటౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అద్దంకిలోని కమతేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు సృజన సాహిత్య సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాకవి దూర్జటి కవిత్వము-భక్తితత్వము అనే అంశంపై ఉపన్యాసకులు వారణాసి రఘురామశర్మ ఉపన్యసిస్తారని తెలిపారు. రోటరీ క్లబ్ 2024-25 రోటరీక్లబ్ఆఫ్ శింగరకొండ బాధ్యులకు సత్కారం నిర్వహించనున్నట్లు రోటరీ మిత్రులు అందరు హాజరుకావాలన్నారు.

కోలలపూడిలో వందమందికి కంటిపరీక్షలు

మార్టూరు,జూలై12(ఆంధ్రజ్యోతి):మండలంలోని కోలలపూడి గ్రామంలో దివంగత మోరపాకుల వెంకటస్వామి, రమేష్ చక్రవర్తిల జ్ఞాపకార్థం శనివారం సర్పంచ్ ఎం.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఎల్‌వీ.ప్రసాద్ కారంచేడు కంటి ఆస్పత్రివారు రోగులకు పరీక్షలు నిర్వహించారు. వారు వంద మందికి పైగా రోగులకు పరీక్షలు నిర్వహించారు. వారిలో 40 మందికి ఆపరేషన్లు చేయాలని కంటి వైద్యులు రోగులకు తెలిపారు. కార్యక్రమంలో టెక్నీషియన్ కే.మంజుభార్గవి, ఫీల్డు అసిస్టెంట్ జే.సాంబరాజ్యం గ్రామ నాయకులు తాటి నాగార్జున, కందిమళ్ల కొండలరావు, యడవల్లి సాంబయ్య, సింగరయ్య తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా సాంబశివరావు

మార్టూరు, జూలై12(ఆంధ్రజ్యోతి): మార్టూరు రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం రాత్రి స్థానిక ఎంఎస్ఎన్ కంపెనీ ఆవరణలో ఏర్పాటుచేసిన సభావేదికపై నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన రోటరీ గవర్నర్ యస్‌వి రాంప్రసాద్ నూతన కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. వారిలో అధ్యక్షులుగా మాదాల సాంబశివరావు, కార్యదర్శిగా చెరుకూరి నాగేశ్వరరావు, కోశాధికారిగా గోనుగుంట్ల రవికుమార్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ ఎ.రత్నప్రభాకర్, రావి అంకమ్మ చౌదరి, ఎం.ఈశ్వరప్రసాద్, ఇంటూరి ఆంజనేయులు, షేక్ ఖాజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

అద్దంకిటౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వాసవి కళ్యాణ మండపంలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం జరగనుంది. వాసవి కళ్యాణ మండపంలో 2025-26 నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సం ఉదయం 10 గంటలకు జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ యస్‌వి రాంప్రసాద్ హజరు అవుతారని తెలిపారు. కావునరోటరీ క్లబ్ సభ్యులు, మిత్రులు అందరు హజరు కావాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మార్టూరు, జూలై12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జనార్థన్ కాలనీకి చెందిన పిడ్రాళ్ల పోలయ్య (35) అనే వ్యక్తి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు సీఐ ఎం.శేషగిరిరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఈ నెల 10న గురువారం సాయంత్రం జనార్థన్ కాలనీలో మృతుడు పోలయ్యకు, ఆయన బాబాయి శ్రీను మధ్య వివాదం చోటుచేసుకొంది. వారు మాంసం విక్రయిస్తుంటారు. ఈ నేపథ్యంలో వారి మధ్య వివాదం చోటుచేసుకొంది. దీంతో శ్రీనుతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు పోలయ్యను నాపరాళ్లతో దాడి చేసి గాయపరచారు. దాంతో తీవ్రంగా గాయపడిన పోలయ్యను కుటుంబసభ్యులు చిలకలూరిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం శుక్రవారం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతిచెందారు. పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో శవపంచనామా నిర్వహించారు. మృతదేహానికి శనివారం సాయంత్రం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వమించామని, కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతునికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

బల్లికురవ. జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో కొంత కాలంగా పలు కేసులు ఉండి రౌడీషీటర్లుగా నమోదైన వారికి శనివారం ఎస్ఐ వైనాగరాజు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యాక్షన్ గ్రామం వేమవరంలో రెండు కేసులలో ఉన్న వైసీపీ, టీడీపీలకు చెందిన వారికి బల్లికురవ స్టేషన్‌లో సంతమాగులూరు సర్కిల్ కార్యాలయంలో కౌన్సెలింగ్ చేపట్టారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా జీవించాలన్నారు. ఎవరైన ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చందుకు మనం ఫౌండేషన్ సత్కారం

మార్టూరు, జూలై12(ఆంధ్రజ్యోతి): మార్టూరులోని అమ్మ ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందును శుక్రవారం రాత్రి హైదరాబాదులో చిక్కడపల్లిలోని త్యాగరాయగానసభలో సామాజిక సేవాసంస్థ మనం ఫౌండేషన్ వారు 9వ వార్షికోత్సవం సందర్భంగా భారత సేవారత్న జాతీయ అవార్డు తో సత్కరించారు. ఈ సందర్భంగా మనం ఫౌండేషన్ అధినేత డాక్టరు చక్రవర్తి కమిటి సభ్యులు మహిళలు గుంటుపల్లి చందును శాలువతో ఘనంగా సత్కరించి, షీల్డును అందచేశారు. గత కొంతకాలంగా మార్టూరు లో పేదలకు, వృద్ధులకు అమ్మ ఆశ్రమం పేరుతో అన్నదానం చేస్తున్న చందు సేవలను గుర్తించి మనం ఫౌండేషన్ వారు ఈ అవార్డును అందచేశారు.

నేడు ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

పర్చూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని వైఆర్ హైస్కూల్‌లో ఏలూరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఏలూరి క్యాంపు కార్యాలయం సిబ్బంది శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు శంకర వైద్యశాల నిపుణలతో ఆదివారం ఉదయం రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి శస్త్రచికిత్సలు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైసీపీ మండల స్థాయి సమావేశం

కారంచేడు/పర్చూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు శ్రీ వేంకటేశ్వర కమ్యూనిటీ హాల్‌లో వైసీపీ మండల కన్వీనర్ జువ్వా శివరాం ప్రసాద్ ఆధ్వర్యంలో 'బాబు ఘారిటీ - మోసం గ్యారంటీ' (మోనిఫెస్టోపై) మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పర్చూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి గాదే మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.


భవనం తలుపువద్ద పెరిగిన పిచ్చిమొక్కలు, సీలింగ్ పాడై దుమ్ము, ధూళితో నిండిన మందిరం, పగిలిన కిటికీ అద్దాలు, మెట్లపై దెబ్బతిన్న మార్బుల్స్

రైతు సేవలకు 'విశ్రాంతి'

- నిరుపయోగంగా రైతు విశ్రాంతి భవనం
- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం

మార్టూరు, జూలై12: (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డు ఆవరణలోని రైతు విశ్రాంతి భవనానికి ఆదరణ కరువైంది. యార్డులో పడమరవైపు ఉన్న భవనంలో మొదటి అంతస్తులో రైతు విశ్రాంతి భవనాన్ని ప్రారంభించారు. కాని ఈ విశ్రాంతి భవనం ఉన్న సంగతి అటు మార్కెటింగ్ శాఖ అధికారులుగాని, వ్యవసాయ మార్కెట్ యార్డు అధికారులు గాని, చివరకు రైతులు కూడా మర్చిపోయారా అన్నట్లుగా ఉంది.. 2014 లో ఫిబ్రవరి 14న అప్పటి పర్చూరు శాసనసభ్యులు దగ్గుబాటి వెంకటేశ్వరరావు రైతులు కోసం, రైతులతో అధికారులు ఏర్పాటుచేసే సమావేశాలు కోసం రైతు విశ్రాంతి భవనం ప్రారంభించారు. ఈ భవనంలో వ్యవసాయంలో ఆధునిక పరిజ్ఞానం వైపు రైతులను మళ్లించడానికి వారికి శిక్షణ ఇచ్చేందుకు, ఇంకా అన్నిరకాలుగా రైతులకు ఉపయోగపడుతుందనే ఉద్దేశ్యంతో రైతు విశ్రాంతి భవనంగా ఈ భవనాన్ని నిర్మించారు. కాని ప్రస్తుతం ఈ భవనంలో ఎలాంటి ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహించలేని దుస్థితి ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో సంతమాగులూరు వ్యవసాయమార్కెట్ నుంచి మార్టూరు మార్కెట్‌యార్డును పర్చూరు వ్యవసాయమార్కెట్ యార్డులో విలీనం చేశారు. దీంతో ప్రస్తుతం ఉన్న రైతు విశ్రాంతి భవనంలో ఉన్న కుర్చీలు, సోఫాలు, చివరకు విద్యుత్ సీలింగ్ ఫ్యాన్లు, ఇంకా తదితర ఫర్నిచర్‌ను సంతమాగులూరు కార్యాలయానికి తీసుకుపోయారు. దాంతో విశ్రాంతి భవనం వైపు కన్నెత్తి చూసే అధికారులుగాని, రైతులు గాని లేకుండా పోయారు. భవనంలోపల పూర్తిగా దుమ్ముదూళి నిండి ఉంది. ఈ భవనానికి పూర్తిగా విద్యుత్‌ను నిలిపివేశారు. కరెంటు బోర్డులు కూడా ధ్వంసమయ్యాయి. కొంతమంది ఆకతాయిలు కిటికీలకు ఉన్న అద్దాలను పగల గొట్టారు. రాత్రి సమయంలో కొంత మంది మందుబాబులు భవనంలోపల మద్యం సేవిస్తున్నట్లు సమాచారం. వారిని అదేమిటని మార్కెట్ సిబ్బంది అడిగే సాహసం చేయలేకపోతున్నారు. పర్చూరు వ్యవసాయమార్కెట్ యార్డు పరిధిలోని మార్టూరు వ్యవసాయమార్కెట్‌ను ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ భవనంపైకి వెళ్లడానికి ఉన్న మెట్లుకూడా చాలా చోట్ల పగిలిపోయాయి. ఇప్పటికైనా రైతు విశ్రాంతి భవనాన్ని పూర్తిగా మరమ్మత్తులు చేసి, రైతులకు అందుబాటులో ఉపయోగపడే విధంగా చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

పీహెచ్‌సీ పరిసరాలు శుభ్రం చేసిన సిబ్బంది

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

బల్లికురవ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణను వైద్యసిబ్బంది శుభ్రం చేయించారు. ఈ నెల 2న 'పీహెచ్‌సీకి వెళ్లాలంటే పిచ్చిమొక్కలతో భయం భయం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వార్తకథనం ప్రచురితమైంది. దీంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. అధికారుల ఆదేశాల మేరకు వైద్యాధికారి రవితేజ నాలుగు రోజుల నుంచి వైద్యశాల మెత్తం కూలీలతో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయించారు. అలానే వైద్యశాల ఆవరణలో దోమలు రాకుండా గడ్డి పోయేందుకు గడ్డి మందును పిచికారి చేశారు. వైద్యశాల నలువైపులా గోడలపై ఎగబాకి ఉన్న పిచ్చి మొక్కలను శుభ్రం చేయించారు. వైద్యశాలకు వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని వైద్యాధికారి తెలిపారు.


పరిశుభ్రంగా ఉన్న వైద్యశాల ప్రాంగణం


అరోగ్య కేంద్రం భవనం చుట్టూ తొలగించిన పిచ్చిమొక్కలు

తారురోడ్డు పనుల ప్రారంభం

యద్దనపూడి,(మార్టూరు),జూలై12(ఆంధ్రజ్యోతి): మండలంలో 16 వ నంబరు జాతీయ రహదారినుండి బొల్లాపల్లి గ్రామం వరకు తారురోడ్డు నిర్మాణాన్ని శనివారం ప్రారంభించారు. రూ. 65 లక్షలను ప్రభుత్వం కేటాయించింది. అదేవిధంగా యద్దనపూడి మండల పరిధిలో పోలూరు నుంచి వింజనంపాడు మీదగా తిమ్మరాజుపాలెం వరకు తారు రోడ్డు నిర్మాణానికి రూ.10.50 కోట్లు మంజూరయ్యాయి. అందుకు సంబందించి రోడ్డు నిర్మాణ పనులు శనివారం ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ రోడ్లు మరమ్మత్తులు నిమిత్తంగాని, ఇతరత్రా పనులు నిమిత్తం గాని ఒక్కరూపాయి కూడా అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరుచేయలేదు. దీంతో ప్రజానీకం పూర్తిగా గుంతలమయమయిన ఈ రహదారులలో ప్రయాణం అంటేనే భయపడేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే యుద్ధప్రాతిపదికన రోడ్ల నిర్మాణానికి నిధులను మంజూరు చేయించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


తిమ్మరాజుపాలెం వద్ద ప్రారంభమైన పనులు

రెండు గ్రామాలలో తీరిన తాగునీటి సమస్య

మార్టూరు,జూలై12(ఆంధ్రజ్యోతి):మండలంలోని రాజుపాలెం, బల్లికురవ మండలంలోని కే.రాజుపాలెం గ్రామస్థులకు తాగునీటి సమస్య తీరినట్లేనని అసిస్ట్ సంస్థ అధ్యక్షులు జాష్టి రంగారావు అన్నారు. శనివారం కే.రాజుపాలెం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీరు జాష్టి శ్రీనివాసులు తన సొంత నిధులు రూ.18 లక్షలతో కొణిదెనరోడ్డులో మంచినీటి చెరువు వద్ద, అసిస్ట్ సంస్థ సహకారంతో నూతనంగా వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ వాటర్ ప్లాంట్‌ను జాష్టి రంగారావు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ గ్రామానికి చెందిన యువకుడైన జాష్టి శ్రీనివాసులు ప్రజల కోసం, సొంతనిధులతో వాటర్‌ప్లాంట్ ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. సంపాదించిన సొమ్ములో కొంత గ్రామానికి ఉపయోగించాలనుకునే శ్రీనివాసులు లాంటి యువకులు గ్రామంలో మరి కొంతమందికి ఆదర్శంగా నిలిచారన్నారు. ముఖ్యంగా రోజువారీ ప్రజలకు నిత్యావసర వస్తువైన మంచినీరును అందించాలన్న అతని తపనను గ్రామస్తులు మెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అంజనేయులు, డాక్టరు వేలూరి కృష్ణమూర్తి, మాజీ యంపిటిసి అడుసుమల్లి శ్రీనివాసరావు,అసిస్ట్ సంస్థ అసోసియేట్ డైరెక్టర్లు విష్ణుప్రియ, తదితరులు పాల్గొన్నారు.


వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో అసిస్ట్ సంస్థ అధ్యక్షులు జాష్టి రంగారావు

పశుబీమా పథకాన్ని వినియోగించుకోండి

మండల పశువైద్యాధికారి మురళీకృష్ణ

పంగులూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా అమలు చేస్తున్న పశుబీమా పథకాన్ని రైతులు వినియోగించుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణ కోరారు. పశుసంవర్ధకశాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను డాక్టర్ మురళీకృష్ణ వివరించారు. ఎస్సీ ఎస్టీ, దారిద్ర్య రేఖకు దిగువన్న వారికి పశుబీమా ప్రీమియం చెల్లింపులో రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. నాటు పశువులకు గరిష్ఠంగా రూ.832, మేలు జాతి పశువులకు గరిష్ఠంగా రూ.1632 ప్రీమియం చెల్లింపులో సబ్సిడీ వర్తిస్తుందన్నారు. ఒక కుటుంబానికి 10 పశువుల వరకు పశుబీమా సౌకర్యం వర్తిస్తుందని డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. పశుబీమా 15 వేల నుండి లక్షవరకు గేదె విలువను బట్టి ప్రీమియం చెల్లించి బీమా సౌకర్యం పొందవచ్చని, ఇందుకు సంబంధించిన వివరాల కోసం రైతుసేవాకేంద్రాలు, పశువైద్యాధికారిని సంప్రదించాని కోరారు.

నట్టల నివారణ, సొంగవ్యాధి నివారణ చర్యలు

మండలంలోని 21 గ్రామ పంచాయితీల పరిధిలో 19,559 గొర్రెలు, మేకలకు నట్ల నివారణ మందు తాగించినట్లు డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. గొర్రెలలో వచ్చే సొంగకార్చే వ్యాధి నివారణ చర్యలలో భాగంగా 13531 గొర్రెలకు నీలి నాలుక వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. ఇక పశుపోషకులకు 50 శాతం రాయితీపై పశువుల దాణా అందజేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని పంగులూరు, రామకూరు, ముప్పవరం పశువైద్యశాలల పరిధిలో 20 మెట్రిక్ టన్నుల పశుదాణాను 50 శాతం రాయితీపై ఆయా గ్రామాల రైతులకు అందజేయనున్నట్లు తెలిపారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన


కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

చినగంజాం, జూలై 12(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందిస్తుందని తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని పెదగంజాం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని సుబ్బారెడ్డి అన్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఏడాది కూటమి ప్రభుత్వం అములు చేసిన పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చెరువులో పడి వేటపాలేనికి చెందిన సివిల్ ఇంజనీర్ మృతి

నిజామాబాద్ జిల్లా నవీపేట మండలంలో ఘటన

నవీపేట, జూలై12 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా నవీపేట మండలంలోని కోస్లీ శివారులోని కాశీరెడ్డి చెరువులో ప్రమాదవశాత్తు పడి గుట్టి ఉమా గణేష్(30)అనే ప్రైవేట్ సివిల్ ఇంజనీర్ మృతి చెందాడని ఎస్ఐ వినయ్ తెలిపారు. బోధన్ నుంచి భైంసా వరకు కొనసాగుతున్న 161బీబీ జాతీయ రహదారి విస్తరణ పనులను పర్యవేక్షిస్తున్న ప్రైవేట్ సివిల్ ఇంజనీర్ ఉమా గణేష్ గత కొంత కాలంగా ఇక్కడే పని చేస్తున్నాడని తెలిపారు. శుక్రవారం సాయంత్రం కోస్లీ శివారులో పని నిమిత్తం బయటకు వెళ్లిన అతడు తిరిగి చేరుకోలేదని అన్నారు. శనివారం ఉదయం ఉమా గణేష్ మృతదేహం చెరువులో బయటపడిందని మృతుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడు ఉమా గణేష్ అవివాహితుడని, అతడు చీరాల మండలం వేటపాలెం గ్రామానికి చెందిన వాడని ఎస్ఐ వివరించారు. మృతుడి కుటుంబీకులు ఆంధ్ర నుంచి బయల్దేరి మార్గమధ్యలో ఉండడంతో శనివారం రాత్రి వరకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వివరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి

- ఎమ్మెల్యే కొండయ్య


క్లస్టర్ స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల కోసం ప్రవేశపెట్టిన పథకాలను పారదర్శకంగా ప్రజల్లోకి చేర్చాలని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. శనివారం నియోజకవర్గం పరిధిలోని క్లస్టర్ ఇన్‌చార్జులతో క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటికే సుపరిపాలన కార్యక్రమంతో ప్రతి ఇంటి తలుపు తట్టి అభివృద్ధిని వివరిస్తూ, సమస్యలు తెలుసుకుంటున్నట్లు చెప్పారు. అన్నిప్రాంతాల్లో మౌలిక వసతులుతో పాటు, స్థానిక అవసరేతర అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాండురంగ స్వామి ఆలయానికి భక్తుల విరాళం


విరాళం అందజేస్తున్న భక్తులు

చీరాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విఠల్ నగర్‌లో వేంచేసిన రుక్మాబాయి సమేత పాండురంగ స్వామి దేవస్థానానికి భక్తులు బూదరాజు శివప్రసాద్, శాంతికళ దంపతులు రూ.1.50 లక్షలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దంపతులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి సహకరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు విశ్రాంత ఎంపీడీవో శ్రీరామచంద్రమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆలేరు వాగు అభివృద్ధికి చర్యలు

- గండ్లు పూడుస్తూ..కట్టలు బలోపేతం


చిల్లచెట్లు తొలగించే పనులు చేపడుతున్న ఎక్స్‌కవేటర్

దగ్గుబాడు/పర్చూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఎన్నోఏళ్లగా అభివృద్ధికి నోచుకోక అస్తవ్యస్థంగా ఉండి వరదకు గురవుతున్న అలేరు వాగుకు గ్రహణం వీడనుంది. వాగు వాగు ఆధునీకరణకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సొంత నిధులతో శ్రీకారం చుట్టారని ఆయన కార్యాలయ ప్రతినిధులు తెలియజేశారు. దీనిలో భాగంగా వాగును పటిష్ఠ పరిచే విధంగా చర్యలు చేపట్టారు. కాలువలో పేరుకు పోయిన చెత్త, ఒండ్రు మట్టిని తొలగిస్తున్నారు. సంతరావూరు నుంచి కొడవలివారిపాలెం, జరుబులవారిపాలెం, నాయుడువారిపాలెం, దగ్గుబాడు, పావులూరు వరకు ఈ కాలువను అధునీకరించనున్నారు. కొన్నేళ్లుగా వరద వాగు అధునీకరణకు నోచుకోక పోవడంతో వాగు పొంగిపొరలుతోందని, 30 చోట్ల గండ్లు పడి వరదల సమయంలో పంటభూములన్నీ నటిలో మునిగిపోతున్నాయని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయారు. దీనిపై స్పందించిన ఏలూరి అధికారులను పిలిపించి తక్షణ చర్యలకు కార్యాచరణ రూపొందించారు. ప్రస్తుతం సొంత నిధులు వెచ్చిస్తూ పనులు చేయిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. కాలువ పనులు చేపట్టడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే బడ్జెట్ వివరాలను అధికారుల వెల్లడించాల్సి ఉంది.

విద్యార్థిపై పోక్సో కేసు నమోదు

ఈపూరుపాలెం(చీరాల), జూలై 12 (ఆంధ్రజ్యోతి) : బీటెక్ విద్యార్థిపై ఈపూరుపాలెం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. స్టేషన్ పరిధిలోని 9వ తరగతి చదువుతున్న బాలికను నమ్మించి లైంగికంగా దాడిచేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారించిన పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

మోటార్‌సైక్లిస్ట్‌కు గాయాలు

నాగులుప్పలపాడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్ అదుపు తప్పి యువకుడు గాయపడిన సంఘటన ఉప్పుగుండూరు గ్రామంలో చోటుచేసుకొంది. స్థానికుల వివరాల మేరకు.. చినగంజాం మండలం పెదగంజాం పంచాయతీ పరిధిలోని బుచ్చిగుంట గ్రామానికి చెందిన చిరుమల చినబాబు శనివారం ఉదయం మోటార్‌సైకిల్‌పై మట్టిగుంట వైపు నుంచి స్వగ్రామం వెళుతున్నాడు. ఈక్రమంలో ఉప్పుగుండూరులోని గంగమ్మ హోటల్ కూడలి వద్దకు రాగా వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో చినబాబుకు గాయాలయ్యాయి. ఆయన్ను చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

- మహిళ వద్ద మద్యం సీసాలు స్వాధీనం

దేవినూతల(చీరాల), జూలై 12 (ఆంధ్రజ్యోతి) : చీరాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు మండల పరిధిలోని దేవినూతల గ్రామంలో దాడులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో పోతురాజుశిల సమీపంలో తోటవారిపాలెం గ్రామం దండయ్య కాలనీకు చెందిన వీరిగ రోజా వద్ద 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే కేసు నమోదు చేసి ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ నాగేశ్వరరావు తెలిపారు.



రెండు నియోజకవర్గాల్లో సాగు,తాగునీరు అందించే బృహత్తర పథకం అది. పేరు శ్రీఆనం సంజీవరెడ్డి హైలెవెల్ కెనాల్ (సోమశిల హైలెవల్ కెనాల్). 13 ఏళ్ల క్రితం పురుడు పోసుకున్న ఈ పథకం పనులు నేటికీ సా...గుతూనే ఉన్నాయి. గత వైసీపీ హయాంలో నత్తేనయం అనేలా పోటీపడిన పనులు ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ అదే తీరున ఉన్నాయి. ఈ ఏడాది సంక్రాంతికల్లా కెనాల్ పనులు ప్రారంభించనున్నట్లు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటించి, ఆర్నెల్లు గడిచినా అమలుకు నోచుకోలేదు. ఇందుకు నిధులు మంజూరు కాకపోవడమే ప్రధాన కారణమని తెలుస్తోంది. హైలెవల్ కెనాల్ పూర్తయితే ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని 90 వేల ఎకరాలకు సాగునీరు, 2.35 లక్షల మంది దాహర్తి తీరే అవకాశం ఉంది.

హామీ ఇచ్చి..

- ప్రారంభంకాని సోమశిల హైలెవెల్ కెనాల్ పనులు
- బృహత్తర ప్రాజెక్టుకు నిధులే ప్రధాన అడ్డంకి
- పూర్తయితే ఆత్మకూరు, ఉదయగిరి సస్యశ్యామలం

ఆర్నెల్లు అయిందయ్యా !

మర్రిపాడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల రైతులు దశాబ్దాల కాలంగా చేసిన విన్నపాల ఫలితంగా సోమశిల హైలెవెల్ కెనాల్‌కు 2012లో రూపకల్పన జరిగింది. 90 వేల ఎకరాలకు సాగునీటితోపాటు 2.35 లక్షల మందికి తాగునీరు అందించాలన్న మహోన్నత లక్ష్యంతో శ్రీఆనం సంజీవరెడ్డి హైలెవెల్ కెనాల్ పనులకు ప్రతిపాదనలు జరిగాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఆత్మకూరు నియోజకవర్గంలో 63,615 ఎకరాలు, ఉదయగిరి నియోజకవర్గంలో 26,385 ఎకరాలు సాగులోకి వస్తాయి. మొత్తంగా ఆరు మండలాల్లోని 58 గ్రామాల రైతులు లబ్ధిపొందుతారు. 2019లో టీడీపీ అధికారంలోకి వచ్చాక రూ.521.53 కోట్లు కేటాయించడంతో పనుల్లో పరోగతి కనిపించింది. మొదటిదశ పనుల్లో భాగంగా 0.23 టీఎంసీల సామర్థ్యంతో చేపట్టిన పొంగూరు జలాశయం పనులు ప్రారంభించి 85 శాతం పూర్తయినట్లు అధికారులు ప్రకటించారు. అయితే, రైతుల అవసరాల కోసం దారికి వదిలిన ప్రాంతంలో కట్టలు కలపడంతోపాటు లైనింగ్ పనులు మిగిలిపోయాయి. 0.33 టీఎంసీల సామర్థ్యంతో ఇస్కపల్లి జలాశయ నిర్మాణం చేపట్టి 45 శాతం పనులు పూర్తి చేశామని అధికారులు ప్రకటించారు. పెగళ్లపాడు వద్ద 1 టీఎంసీ సామర్థ్యంతో జలాశయం పనులు 30 శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. ఈ ప్రాజెక్టులో అన్నిటికంటే ప్రధానమైన రిజర్వాయరు పడమటినాయుడుపల్లి. 1 టీఎంసీ సామర్థ్యం కలిగిన ఈ జలనిధి తొలి విడతలో ప్రారంభించాల్సి ఉన్నా ఇప్పటివరకు పనులు చేపట్టలేదు. అందుకు కారణం మజరా గ్రామాల్లో భూ సేకరణ పూర్తికాకపోవటమే.



పెగళ్లపాడు వద్ద నిర్మించిన పంపు హౌస్ వద్ద తుప్పుపట్టిన యంత్రాలు



అర్ధంతరంగా ఆగిన కంప సముద్రం రిజర్వాయర్ పనులు

● మాట నిలుపుకోని జగన్

రెండవ దశ పనులు చేపట్టాలని గత వైసీపీ ప్రభుత్వం 2020, నవంబరు 9న అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంతో తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. 2024 ఎన్నికల నాటికి ఈ పనులు పూర్తి చేయనున్నట్లు అప్పట్లో జగన్ ప్రటించారు. కానీ పనులు పరిశీలిస్తే కంపసముద్రం రిజర్వాయర్ పనులు ప్రారంభమై చెరువు కట్టపనులు 80శాతం మాత్రమే పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. అన్నిచోట్లా నిర్మించిన పంపు హౌస్‌కి ఏర్పాటు చేసిన యంత్రాలు తుప్పుపట్టాయి.

అభివృద్ధి ఆగిపోయింది



భూ సేకరణలో జాప్యం కరణంగా మొదటి దశలో ప్రారంభించాల్సి రిజర్వాయర్ పనులు మా పడమటినాయుడుపల్లిలో చేపట్టలేదు. మా గ్రామం అంతా డ్యామ్ నిర్మాణంలో పోతుండటంతో పునరావాసాలు ఏర్పాటు చేస్తారని ఎదురు చూస్తున్నాం. హైలెవల్ కెనాల్ ప్రకటించినప్పటి నుంచి గ్రామంలో అభివృద్ధి ఆగిపోయింది.

- పీ.శ్రీనివాసులు, పడమటినాయుడుపల్లి

అదే పరిహారమని చెబుతున్నారు



భూములు కోల్పోయిన రైతులకు పరిహారమని ఎప్పటి నుంచో చెబుతున్నారు. ఇంతవరకు అందించలేదు. 12 ఏళ్ల క్రితం ఎకరాకి రూ.8లక్షలు చొప్పున పరిహారాన్ని కేటాయించారు. నేడు కూడా అదే పరిహారాన్ని అందిస్తామంటున్నారు.

- పీ.తిరుపాలయ్య రైతు, పడమటినాయుడుపల్లి, మర్రిపాడు మండలం

● విడుదల కాని నిధులు

ఈ పరిస్థితుల్లో గతేడాది జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావటం, ఆత్మకూరు ఎమ్మెల్యే, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిపై రైతుల ఆశలు చిగురించాయి. కానీ ఏడాది గడిచినా పనుల పురోగతిపై చలనంలేదు. గత ఏడాది డిసెంబరు 10న పొంగూరులో రెవెన్యూ సదస్సుకు వచ్చిన మంత్రి ఆనం పొంగూరు రిజర్వాయర్‌ని పరిశీలించారు. సీఎం చంద్రబాబు సోమశిల జలాశయం పరిశీలనకు వచ్చినప్పుడు త్వరితగతిన పనులు ప్రారంభించాలని, అందుకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని, ఈ ఏడాది సంక్రాంతికి పనులు ప్రారంభంకానున్నట్లు అప్పట్లో మంత్రి తెలిపారు. కానీ ఇప్పటికి ఆరు నెలలు గడుస్తున్నా పనుల్లో పురోగతి లేదు. ఇందుకు నిధులు మంజూరు కాకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. కాగా, ఇటీవల పెగళ్లపాడు రిజర్వాయర్ కింద మునకలో పోతున్న భూముల రైతుల ఖాతాల్లో పరిహారం నగదు జమ అవుతున్నట్లు సమాచారం. ఏదిఏమైనా ఇప్పటివరకు హైలెవల్ కెనాల్ పనుల్లో ఎలాంటి పురోగతి కనిపించకపోవడంతో రైతులు తీవ్ర నిరాశ చెందుతున్నారు.

కాలువపై ఎన్నో ఆశలు



ఈ రైతు పేరు కన్నెమరకాల వెంకటేష్. మర్రిపాడు మండలం పెగల్లపాడు గ్రామం. ఈయనకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. మెట్టప్రాంతం కావడంతో సోమశిల హైలెవల్ కెనాల్‌పైనే ఆశలు పెట్టుకుని ఉన్నారు. అయితే, వైసీపీ ప్రభుత్వంలో అర్ధంతరంగా పనులు ఆగిపోవటంతో వెంకటేష్ ఆశలు ఆవిరయ్యాయి. కూటమి ప్రభుత్వంలో అయినా పనులు పునఃప్రారంభం అవుతాయని ఆశలు పెట్టుకుని ఉన్నారు.

- కన్నెమరకాల వెంకటేష్, రైతు, మర్రిపాడు

మంచినీటి సమస్య పరిష్కారం



హైలెవల్ కెనాల్ పనులు త్వరితగతిన పూర్తి చేసి మంచినీరు అందిస్తారని ఎదురుచూస్తున్నాం. మా మర్రిపాడు మండలంలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉండటంతో కిడ్నీ బాధితులు ఎక్కువయ్యారు.కూటమి ప్రభుత్వం చొరవతో అయినా మా ప్రాంతవాసులకు శుద్ధి జలాలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

- పెంచలయ్య, మర్రిపాడువాసి

రెండోరోజు ఉత్సాహంగా
రెవెన్యూ క్రీడలు



చదరంగం పోటీలో తలపడుతున్న రెవెన్యూ ఉద్యోగులు

నెల్లూరు నగరంలోని ఏసీ స్టేడియంలో రెవెన్యూ క్రీడలు రెండోరోజు శనివారం ఉత్సాహంగా సాగాయి. టేబుల్ టెన్నిస్, షటిల్, క్యారమ్స్, బాస్కెట్ బాల్, వాలీబాల్, చెస్, లెమన్ స్పూన్, టగ్‌ఆఫ్‌వార్, లాంగ్ జంప్, హైజంప్ తదితర క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ క్రీడల్లో కలెక్టర్ ఆనంద్ కుమారుడు ఆరుతో కలిసి క్యారమ్స్ ఆడటం చూపరులను ఆకట్టుకుంది. కాగా ఆదివారం పోటీలు ముగియనున్నాయి.

- నెల్లూరు(హరనాథపురం)

నాకు తెలియదు.. సంబంధం లేదు !

● ఎక్సైజ్ అధికారుల విచారణలో కాకాణి

నెల్లూరు(క్రైం), జూలై 12 (ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమ నిల్వల కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై ఇందుకూరుపేట ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో కోర్టు ఆదేశాల మేరకు ఎక్సైజ్ అధికారులు కాకాణిని శనివారం కస్టడీలోకి తీసుకున్నారు. అనంతరం ఆయన్ను జిల్లా పోలీసు శిక్షణ కేంద్రాని(డీటీసీ)కి తరలించి ఉదయం ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విచారించారు. తొలిరోజు పలువురు అధికారులు కాకాణిని విచారించారు. ఆయన్ను వారు 30 ప్రశ్నలు అడిగారు. అన్నింటికి కూడా ఆయన 'నాకు తెలియదు... సంబంధం లేదు' అని సమాధానమిచ్చారు. కాగా ఆదివారం కూడా ఆయన్ను ఎక్సైజ్ అధికారులు విచారించనున్నారు.



ఇండోసోల్ బాధిత యానాదులతో మాట్లాడుతున్న కేసీ పెంచలయ్య తదితరులు

కరేడు బాధితులకు
అండగా ఉంటాం

● రాష్ట్ర యానాదుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు

ఉలవపాడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ సోలార్ పరిశ్రమ కోసం అమాయక యానాదుల భూములను లాక్కొనేందుకు ప్రయత్నిస్తే రాష్ట్రవ్యాప్త ఉద్యమంతో ప్రతిఘటిస్తామని రాష్ట్ర యానాదుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసీ పెంచలయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం ఉమ్మడి జిల్లాల యానాదుల సంఘం ప్రతినిధులతో కరేడులోని పొల్లుగట్టు సంఘం, ఆకుతోట సంఘం, రామకృష్ణాపురం యానాది కాలనీల్లో ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా అక్కడివారు మాట్లాడుతూ 'ఏళ్ల తరబడి కరేడు గ్రామస్థులతో కలిసి జీవిస్తున్నాం, యానాదుల భూములు, గృహాలు బలవంతంగా లాక్కుంటారట. మేం ఇంకెక్కడికి వెళ్లం.. ఇక్కడే ఉంటాం' అన్నారు. యానాదుల కాలనీలలో పర్యటించిన వారిలో జిల్లా అధ్యక్షుడు మానికల మురళి, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష, ప్రకాశం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు కొమరిగిరి మాల్యాద్రి, చేవూరి దుర్గా ప్రసాద్, ఇతర నాయకులు ఇండ్ల మల్లి, యాటగిరి ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

● ఏఐబీఎస్పీ మద్దతు

కరేడు ప్రజల పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తామని ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ (ఏఐబీఎస్పీ) నాయకులు తెలిపారు. శనివారం కరేడు గ్రామంలో ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ బక్కా పరంజ్యోతి, నాయకులు పర్యటించి, స్థానికులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరణికోట లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి తాటిపర్తి వెంకటస్వామి, ఏపీ గిరిజన సమన్వయ కమిటీ కన్వీనర్ పేరం సత్యం, నాయకులు మిరియం శ్రీనివాసులు, రాజశేఖర్ పాల్గొన్నారు.

నేటితో గడువు పూర్తి

- 'అన్నదాత సుఖీభవ'కు ఇప్పటి వరకు 1,93,064 మందికి అర్హత
- ఈకేవైసీ పెండింగ్ ఉన్న రైతుల సంఖ్య 2,095

నెల్లూరు(వ్యవసాయం), జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతు సేవా కేంద్రా(ఆర్ఎస్‌కే)ల్లో అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల జాబితాను వ్యవసాయశాఖ అధికారులు అందుబాటులో ఉంచారు. ఈ జాబితాలో పేరు లేకపోతే దరఖాస్తు చేసుకునేందుకు ఆదివారం వరకు ప్రభుత్వం గడువు ఇచ్చింది. ఈ పథకానికి అర్హత ఉండి పేరు లేకపోతే అందుకు అవసరమైన పత్రాలు ఇవ్వాల్సి ఉంది. అనంతరం అన్నదాత పోర్టల్‌లోని గ్రీవెన్స్ మాడ్యూల్‌లో కూడా ఫిర్యాదు చేసుకోవచ్చు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1,93,064 రైతు కుటుంబాలను అర్హులుగా గుర్తించారు. ఇంకా 2,095 రైతు కుటుంబాలు ఈకేవైసీ నమోదు చేయించుకోవాల్సి ఉంది. వీరంతా దాదాపుగా అందుబాటులో లేరని సమాచారం.

గ్రీవెన్స్ మాడ్యూల్‌లో 1,209 మందికి అర్హత

గ్రీవెన్స్ మాడ్యూల్‌లో 1,409 దరఖాస్తులు రాగా 1,209 మందిని అర్హులుగా నమోదు చేశాం. 198 పెండింగ్‌లో ఉన్నాయి. రెండింటిని రద్దు చేశాం. తహసీల్దారు లాగిన్‌లో 35 దరఖాస్తులు రాగా 14ను ఓకే చేశాం, 18 పెండింగ్‌లో ఉన్నాయి. మూడింటిని రద్దు చేశాం. అర్హులు ఎవరైనా ఉంటే ఆదివారం(నేటి)లోగా ఫిర్యాదు చేయవచ్చు.

- పీ.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

సమ్మెలోకి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

● ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో కార్పొరేషన్ అధికారులు

నెల్లూరు(సిటీ), జూలై 12,(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరించాలని జిల్లాలోని మున్సిపాలిటీల్లోనూ, నగర కార్పొరేషన్ లోనూ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులు సమ్మెబాట పట్టారు. శనివారం అర్ధరాత్రి (తెల్లవారితే ఆదివారం) నుంచి విధులను బహిష్కరిస్తున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు ఉన్నతాధికారులకు సమ్మె నోటీసులు అందచేశారు. ఎన్ఎంసీ కమిషనర్, ఎస్ఈలకు వాట్సాప్ ద్వారా సమాచారాన్ని అందచేశారు. తాగునీటి సరఫరా విభాగంలోని ఫిట్టర్లు, వాల్ ఆపరేటర్లు, వీధి లైట్ల నిర్వహణ సిబ్బంది, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సిబ్బంది తదితరులు 200 మంది వరకు సమ్మెలో పాల్గొంటున్నట్లు ఫెడరేషన్ జిల్లా నాయకులు తెలిపారు. జీతాలు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అవకాశం కల్పించాలని, పదవీ విమరణ అనంతరం ఆర్థిక ప్రయోజనాలతోపాటు, వారసులకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్న డిమాండ్లతో కొన్ని రోజులుగా వీరు ఆందోళన చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో సమ్మెబాటపట్టినట్లు వారు తెలిపారు. ఈ విషయమై ఎస్ఈ రామ్మోహన్‌రావును వివరణ కోరగా సమ్మె వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రైవేట్ కార్మికులను రంగంలోకి దింపుతున్నట్లు ఆయన వివరించారు.

మాలకొండ ఆదాయం రూ. 12,45,009

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 12,45,009 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్. చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టికెట్ల ద్వారా రూ. 7,850, కుంకుమార్చన ద్వారా రూ. 20,880, తలనీలాల ద్వారా రూ. 49,625, వాహనపూజల ద్వారా రూ. 5,680, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 3,96,400, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 920, రూము అద్దెల ద్వారా రూ. 33,910, కవర్ల విక్రయం ద్వారా రూ. 11,500, లడ్డూప్రసాదం ద్వారా రూ. 2,57,960, అన్నదానం ద్వారా రూ. 4,60,284 ఆదాయం లభించినట్లు ఆయన తెలిపారు.

● స్వామివారిని దర్శించుకున్న ప్రకాశం జిల్లా న్యాయాధికారి

మాల్యాద్రి లక్ష్మీనరసింహం స్వామిని శనివారం ఒంగోలు జిల్లా న్యాయాధికారి ఏ. భారతి, రాష్ట్ర పోలీసు అధికారి రవిచంద్ర వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రధాన ఉపఅర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర ప్రత్యేక పూజలు చేశారు. శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డీసీ చంద్రశేఖర్, ఎస్ఐ మరిదినాయుడు, టీడీపీ నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, కాకుమాను హర్షకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లు గ్రామాల్లో పర్యటిస్తేనే
మెరుగైన ఫలితాలు

● సమీక్షలో సీసీఎల్ఏ జయలక్ష్మి

నెల్లూరు(హరనాథపురం), జూలై 12(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్లు కార్యాలయాలకే పరిమితం కాకుండా, గ్రామాల్లో పర్యటిస్తేనే మెరుగైన ఫలితాలు వస్తాయని భూపరిపాలనాశాఖ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి అన్నారు. శనివారంరాత్రి కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధుల పట్ల తహసీల్దార్లు బాధ్యతాయుతంగా ఉండాలని అన్నారు. రీసర్వే చేపట్టిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎంను త్వరగా విడగొట్టి, వ్యక్తిగతంగా పాసుపుస్తకాలు ఇవ్వాలని ఆదేశించారు. జాయింట్ ఎల్‌పీఎంగా నమోదు చేయడం వల్ల పలువురు రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేక పోతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్‌లో అందే ప్రజల అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. మండలాల వారీగా తహసీల్దార్లతో ఆర్డీవోలు సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు అనూష, వంశీకృష్ణ, పావని, పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జయలక్ష్మి, వేదికపై కలెక్టర్ ఆనంద్

● కలెక్టర్ స్వాగతం

రాష్ట్ర భూపరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి (సీసీఎల్ఏ) జయలక్ష్మి శనివారం నెల్లూరు పర్యటనకు వచ్చారు. నగరంలోని ఓ హోటల్‌కు చేరుకున్న ఆమెకు కలెక్టర్ ఆనంద్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో హుస్సేన్ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో అభ్యాసం

- బాల్యానికి భరోసా ఇచ్చేలా.. చిన్నారులు ఆరోగ్యంగా ఎదిగేలా చర్యలు
- అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రత్యేక పుస్తకాల పంపిణీ

చేజర్ల, జూలై12 (ఆంధ్రజ్యోతి): బాల్యానికి భరోసా ఇవ్వడంతోపాటు చిన్నారులు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఎదిగేలా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో మార్పులకు శ్రీకారం చుట్టింది. జాతీయ విద్యా విధానం, జాతీయ పాఠ్య ప్రణాళికలో భాగంగా మహిళా,శిశు సంక్షేమ శాఖ, పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నవచేతన, ఆధార్‌శిల అనే రెండు పుస్తకాలను రూపొందించి అంగన్‌వాడీ కేంద్రాలకు అందజేసింది. వీటిలోని అంశాలను ఆయా కేంద్రాల కార్యకర్తలు, సహాయకులు అమలు చేయడంతోపాటు చిన్నారుల తలిదండ్రులకు వివరించాల్సి ఉంది.


● 'నవచేతన'లో ఏముందంటే..

నవచేతన పుస్తకంలో పిల్లల ఎదుగుదల, అభివృద్ధి, పోషణ, ఆరోగ్యం, విద్యాపరమైన అంశాలను పొందుపరిచారు. పసిబిడ్డల పెంపకంలో తల్లి, కుటుంబ సభ్యులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి... వారితో ఎలా ప్రవర్తించాలి... చిట్టి బుర్రలకు అర్థమయ్యేలా ఎలా కబుర్లు, కథలు చెప్పాలి...? అనే విషయాలను ఫొటోలతోసహా ఈ పుస్తకంలో పొందుపరిచారు. చిన్నారికి మూడేళ్ల వయసు వచ్చే వరకు ఏం చేస్తే వారు శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యకరంగా పెరుగుతారో కూడా వివరించారు. పిల్లలకు ఏనెలలో ఎలాంటి అంశాలు నేర్పించాలో కూడా వివరించారు. ఇందులోని అంశాలపై అంగన్‌వాడీ టీచర్ తమ వద్దకు వచ్చే బాలింతలకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది.

శిక్షణ ఇచ్చి పర్యవేక్షిస్తున్నాం..

ప్రభుత్వం పంపిణీ చేసిన ఈ రెండు పుస్తకాలను అంగన్‌వాడీ కార్యకర్తలకు అందించాం.వీటిలోని అంశాలపై కార్యకర్తలకు, సహాయకులకు శిక్షణ ఇచ్చాం. ఇకపోతే కేంద్రాల్లో రోజువారీ కార్యక్రమాల అమలు తీరును పర్యవేక్షిస్తున్నాం.

- సునీలత, సీడీపీవో, ఆత్మకూరు



● 'ఆధార్ శిల' లో...

ఆధార్ శిల పుస్తకంలో పిల్లల సమగ్రాభివృద్ధికి అవసరమైన అంశాలను ఆటల ద్వారా అభ్యాసం చేయించడం, సామాజిక నైపుణ్యాలు పెంపొందించేలా అంశాలను రూపొందించారు. అంతేకాక అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు వినోదాత్మకంగా పాఠాలు ఎలా బోధించాలో..? కూడా వివరించారు. పాఠాలు చెప్పే విధానం కూడా మొత్తం ఆటలు ఆడించే ప్రక్రియగా ఉంటుంది.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు 789 బేళ్లను తీసుకుని రాగా, 18 కంపెనీల ప్రతి నిధులు వేలంలో పాల్గొని 691 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 98 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ280కాగా, కనిష్ఠ ధర రూ159గా పలికినట్లు వేలం నిర్వహణాధికారి జీ. రాజశేఖర్ తెలిపారు.

న్యూస్ బాక్స్

ఘనంగా షిరిడీ సాయిబాబా గ్రామోత్సవం



ట్రాక్టర్‌పై ఊరేగుతున్న సాయిబాబా

సంగం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయినగర్‌లో వెలసి ఉన్న షిరిడి సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి షిరిడి సాయిబాబా గ్రామోత్సవం వైభవంగా జరిగింది. సాయిబాబా విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి గజపూలమాలలు, విద్యుత్‌దీపాలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రసన్న వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

బిట్రగుంట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రవణ నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

పేద విద్యార్థినికి ఎమ్మెల్యే ఇంటూరి ఆర్థిక సాయం

కందుకూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన నిరుపేద విద్యార్థిని విద్యాభ్యాసం కోసం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆర్థికసహాయం అందించారు. మండలంలోని ఓగూరు గ్రామానికి చెందిన ఆర్షియాజ్ పదవ తరగతిలో 577 మార్కులతో మండలస్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించటం ద్వారా ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. అయితే అక్కడ చేరేందుకు ఆమె తల్లిదండ్రులకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇస్లాం దూదేకుల కమిటీ (కువైట్-ఇండియా) ప్రతినిధి నాగూర్ బాబు ఆమె చదువు కోసం రూ. 25వేలు ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కూడా తన వంతుగా రూ. 10వేలు ఆర్థిక సహాయాన్ని ఆర్షియాజ్ కు అందించారు. ఆమె చదువుకోసం తనవంతు సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంబీఏ నాగూర్ బాబు, నరసింహారావు, రామకృష్ణ, జిల్లెలమూడి మస్తాన్, ఖాదర్ బాషా పాల్గొన్నారు.

532 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 625 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 532 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-65, ఆర్‌ఆర్-6, సీఆర్-16, జంపింగ్ లాట్స్-6 కారణాలతో 93 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ. 205.78గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

పేదలకు ఆహారం పంపిణీ

కందుకూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రామసాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పొన్నలూరు తహసీల్దార్ ఉయ్యాల పుల్లారావు సహకారంతో శనివారం విప్పగుంట రోడ్డులో మార్కెట్‌యార్డు ప్రహరీ సమీపంలో నివసిస్తున్న సంచార జాతుల వారికి, పట్టణంలోని వివిధ ప్రాంతాలలో ఉండే యాచకులకు ఆహారప్యాకెట్లు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో రవ్వా శ్రీనివాసులు, ఇన్నమూరి శ్రీనివాసులు, సోమిశెట్టి శశాంక్ గుప్తా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పామూరురోడ్డు సబ్ స్టేషన్ నుంచి వెళ్లే 11 కేవీ వెంకటాద్రిపాలెం ఫీడర్‌లో లైనుకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ టీవీ నరసింహ్మం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని తానికొండవారి కొష్టాలు, రామానాయుడు నగర్, మధురానగర్, బిలాల్‌నగర్, కనిగిరిరోడ్డు సామిల్లుల ఏరియా, లంబాడి డొంక, దూబగుంట, వెంకటాద్రిపాలెం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సీతారామపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సీతారామపురం నుంచి మోటారుబైకుపై శనివారం మండలంలోని గంధంవారిపల్లికి నరాల రాజశేఖర్, రమణయ్య వెళ్తున్నారు. మార్గమధ్యంలోని ఇటుకల బట్టీ వద్దకు వచ్చేసరికి జాతీయ రహదారిపై పంది అడ్డుగా రావడంతో ఢీకొని గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నత్తనడకన అన్నపుగుంట తూము పనులు

- రాకపోకలకు ప్రజలు, వాహనదారుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



అన్నపుగుంట వైపు జరుగుతున్న తూము నిర్మాణ పనులు



కలుగోళ శాంభవి ఆలయ మార్గంలో జరుగుతున్న పనులు

కావలి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ అన్నపుగుంట వద్ద సుమారు రూ.30 లక్షలతో నిర్మిస్తున్న తూము అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో రాకపోకలకు ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అత్యవసరమైన ఈమార్గంలో చకచకా జరగాల్సిన పనులు నత్తనడకన సాగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోతే వైకుంఠపురం, జనతాపేట వాసులు కలుగోళ్ల శాంభవి ఆలయం వైపు పట్టణంలోకి రాకపోకలు సాగించాలంటే కనీసం 4.కి.మీ చుట్టూ తిరిగి రావాల్సి ఉంది. అలాగే జేబీ కళాశాలకు, పీజీ సెంటర్‌కు వెళ్లే విద్యార్థులు, 8వ వార్డు మున్సిపల్ ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థుల రాకపోకలకు అవస్థలు తప్పటంలేదు. కాగా, అన్నపుగుంటలో ఉన్న మురుగు నీరు బావులు, బోర్లలోకి చేరుతోందని స్థానికులు ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లటంతో ఆయన స్పందించి నిధులు మంజూరు చేయించి అన్నపుగుంటలో పూడిక తీయించారు. అలాగే పూడికతీసిన ఆ గుంట నిండిన తర్వాత ఆ నీరు కలుగోళ్ల శాంభవి ఆలయం వైపు ఉన్న వరవ కాలువలోకి రైల్వేట్రాక్ కింద ఉన్న వరదనీటి మార్గం ద్వారా పొర్లి వస్తుంటాయి. దీంతో అక్కడ పాదచారులకు ఇబ్బందిగా ఉండటంతో నీరు అక్కడ పొర్లకుండా ఉండే విధంగా ఆ మార్గంలో పైపులు ఏర్పాటుచేసి దానిపై కాంక్రీట్ చేస్తున్నారు. ఆ నీరు పైపుల ద్వారా వరవ కాలువలోకి నేరుగా వెళ్లే విధంగా డిజైన్ రూపొందించారు. అంతవరకు అందరూ హర్షిస్తున్నా నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన పనులు జరిగేలా చర్యలు తీసుకుని రాకపోకలకు కలుగుతున్న ఇబ్బందులను తొలగించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సుపరిపాలన అందించడమే తెలుగుదేశం ప్రభుత్వ లక్ష్యం



ఉలవపాడు: ఎస్సీ కాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



కందుకూరులో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



గుడ్లూరు: తెట్టులో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

కందుకూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వార్డులు, మండలంలోని శ్రీరంగరాజపురం గ్రామంలో శనివారం టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ కరపత్రాలు పంపిణీచేశారు. పట్టణంలోని 137వ బూత్‌లో తెలుగు మహిళా అధ్యక్షురాలు కల్లూరి శైలజ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు కరపత్రాలు పంపిణీ నిర్వహించగా సుల్తాన్‌మొహిద్దీన్ నగర్‌లో షేక్ రఫీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని శ్రీరంగరాజపురంలో మండల పార్టీ అధ్యక్షుడు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సలహాదారు గుళ్లా శ్రీనివాసులు, వివిధ గ్రామాల నాయకులు పచ్చవ తిరుపతిస్వామి, రెబ్బవరపు మాల్యాద్రి, రావుల రవి, ఈదర నరసయ్య, రాయపాటి శ్రీను, భైరపనేని రమణయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు వంకదారి శ్రీనివాసులు, స్థానిక నాయకులు వీరారెడ్డి, మాలకొండారెడ్డి, మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● గుడ్లూరు: రాష్ట్రంలో సుపరిపాలన అందించడమే తెలుగు దేశం ప్రభుత్వ ధ్యేయమని గుడ్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు అన్నారు. మండలంలోని తెట్టు గిరిజన కాలనీలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పార్టీ నాయకులు నిర్వహించారు. కాలనీలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ సంవత్సర కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం నిర్వహించిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అలాగే స్థానికంగా నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు చిత్తారి మల్లికార్జున, ఉమ్మినేని సుబ్బారావు, గ్రామ నాయకులు మద్దసాని శ్రీనివాసులు, కె వెంకటేశ్వర్లు, షేక్ చినబాబు, యర్రంశెట్టి వెంకటేశ్వర్లు, జాల రామయ్య, తెట్టు, మోచర్ల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం తెలిపారు. మండలంలోని కళ్లవళ్ల, వలేటివారిపాలెం తదితర గ్రామాల్లో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మోదేపల్లి నారాయణ, కాకుమాను ఆంజనేయులు, మోదేపల్లి నరసింహారావు, వలేటి నరసింహం, మోదేపల్లి శ్రీనివాసులు, వలేటి మధుసూదన్‌రావు, మోదేపల్లి మధు, వీరమోసు అంజయ్య, మోదేపల్లి వెంకటనరసింహం, తదితరులు పాల్గొన్నారు.

● ఉలవపాడు: స్థానిక ఎస్సీ కాలనీలో శనివారం సాయంత్రం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సుపరిపాలన తొలిఅడుగు ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి పనికి వెళ్లినా మస్టర్లు సరిగా వేయడం లేదని బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. దీంతో ఉపాధి సిబ్బందితో మాట్లాడి మరోసారి జరగకుండా చూడాలని ఆదేశించారు. కాలనీలో పారిశుధ్యం, శిథిలావస్థలో ఉన్న కమ్యూనిటీ హాల్ స్థానంలో కొత్త భవనం నిర్మాణం, పక్కాగృహాల మంజూరు తదితర సమస్యలను పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తొలుత మండల పార్టీ అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు కార్యకర్తలు, నాయకులతో కలిసి ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు గిరి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● చేజర్ల: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చేజర్ల మండల టీడీపీ అధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్ అన్నారు. శనివారం మండలంలోని తిరుపతినాయుడుపల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నేతృత్వంలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు రావి లక్ష్మీనరసారెడ్డి, చీర్ల వెంకటేశ్వర్లు, స్థానిక టీడీపీ నాయకులు అంకయ్య తదితరులు పాల్గొన్నారు.



కళవళ్లలో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు



తిరుపతినాయుడు పల్లిలో కరపత్రాలు పంచుతున్న నేతలు

తాగునీరు వృథా పట్టదా...?



వృథాగా పోతున్న తాగునీరు

ఉదయగిరి రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించుకోవాలని అధికారులు చెబుతున్న మాటలు మండలంలోని దుర్గంపల్లిలో నీటి మూటలుగానే మిగులుతున్నాయి. ఆ గ్రామంలోని ప్రధాన రహదారి సమీపంలో తాగునీటిని సరఫరా చేసే విద్యుత్ మోటారు వద్ద రోజుల తరబడి తాగునీరు వృథా అవుతున్నప్పటికీ పట్టించుకునే నాథులే కరువయ్యారనే విమర్శలు ఉన్నాయి. పైపులైనుకు అమర్చిన వాల్వు వద్ద నిరంతరం నీరు వృథాగా పోతుండడంతో ప్రాంగణమంతా బురదమయంగా మారి దోమలకు నిలయంగా దర్శనమిస్తోంది. దీంతో నివాసాలకు నీటి సరఫరా తగ్గుముఖం పడుతుండడంతో పాటు రోగాల బారిన పడాల్సిన దుస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి వృథాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విద్యుత్ స్తంభాన్ని అల్లుకున్న నిర్లక్ష్యపు తీగ..



విద్యుత్ స్తంభానికి అల్లుకున్న మొక్క

అనంతసాగరం జూలై 12 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మంగుపల్లి, గౌరవరం వద్ద విద్యుత్ స్తంభాలకు తీగజాతి మొక్కలు అల్లుకొని ఉన్నాయి. దీంతో వర్షం పడిన సమయంలో విద్యుత్ అంతరాయం నెలకొనే అవకాశం ఉంది. బద్వేల్ ప్రధాన రహదారి పక్కనే ఈ పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

పగలే వెన్నెలా..



అన్నారెడ్డిపాలెంలో వెలుగుతున్న వీధిలైట్లు

సంగం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం లక్షలకు లక్షలు వెచ్చించి సబ్సిడీలు, సోలార్ లైట్లు, సోలార్ ప్యానల్ వంటివి అంజేస్తుంది. అయితే పంచాయతీల్లో పర్యవేక్షణ కొరవడడంతో వీధిలైట్లు పట్టపగలే వెలుగుతూ దర్శనమిస్తున్నాయి. అందుకు నిదర్శనం అన్నారెడ్డిపాళెం పంచాయతీ. ఇక్కడ వీధిలైట్లు ఆర్పేవారే లేకపోవడంతో నిరంతరం వెలుగుతున్నాయి. విద్యుత్ వినియోగాన్ని అరికట్టాల్సిన ప్రభుత్వ అధికారులే నిర్లక్ష్యం చూపడం విశేషం.

కొండాపురం ఎస్‌ఐగా మాల్యాద్రి



బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ

కొండాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండల ఎస్‌ఐగా జె మాల్యాద్రి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ ఎమ్ వెంకటరావు వీఆర్‌కు వెళ్లడంతో ఆయన స్థానంలో మాల్యాద్రి బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లా పర్చూరు మండలంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై మండలానికి వచ్చారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం : సీఐటీయూ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు పెంచలయ్య

కావలి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పోరాటాలతోనే స్వీపర్ల సమస్యలు పరిష్కరించుకోవాలని సీఐటీయూ నాయకులు పీ పెంచలయ్య తెలిపారు. సీఐటీయూ అనుబంధ ప్రభుత్వ పాఠశాలల స్వీపర్స్ మూడవ మహాసభ శనివారం కావలి సీఐటీయూ కార్యాలయంలో ఏ ఆదిలక్ష్మీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐటీయూ నాయకుడు పీ పెంచలయ్య మాట్లాడుతూ పాఠశాలల స్వీపర్స్‌కు పనిభారం ఎక్కువ, జీతాలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని పోరాటాలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజులలో ఐక్యంగా పోరాడేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల స్వీపర్స్ యూనియన్ కావలి పట్టణ అధ్యక్షురాలిగా ఏ ఆదిలక్ష్మీ, కార్యదర్శిగా కే పద్మ, ఉపాధ్యక్షులుగా ఎం శుభ, జాయింట్ కార్యదర్శిగా ఎం శోభ మరికొంతమంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

కోరం లేక వీఎస్ఎస్ చైర్మన్ ఎంపిక వాయిదా

ఉదయగిరి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుర్గంపల్లి ఎస్సీ కాలనీ వన సంరక్షణ సమితి చైర్మన్ ఎంపిక కోరం లేక వాయిదా వేసినట్లు డీఆర్వో మురళి, ఎఫ్ఎస్‌వో చినవెంకటయ్య శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ 119 మంది సభ్యులకుగానూ చైర్మన్ ఎంపికకు 17 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. దీంతో కోరం లేకపోవడంతో చైర్మన్ ఎంపిక వాయిదా వేశామన్నారు. తదుపరి చైర్మన్ ఎంపిక ఎప్పుడు నిర్వహించేది ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవోలు బచ్చల వెంక టేశ్వర్లు, లక్ష్మీప్రసన్న, ఫద్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు ఇత్తడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అస్మా

ఆత్మకూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో దోమల ఉధృతి పెరగడంతో పాటు అనేక రకాల వ్యాధులు పొంచి ఉన్నాయని డెంగ్యూ జ్వరాలు తదితర సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు అర్బన్ ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ అస్మా తెలిపారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలికల వసతి గృహం, కాలేజి బాలుర వసతి గృహంలో శనివారం ఆమె విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లా డుతూ హాస్టల్ చుట్టూ దోమలు ఉత్పత్తి అయ్యే నీటి నిలువలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. ప్రాణాంతకరమైన డెంగ్యూ, చికెన్‌గున్యా వ్యాధులు దోమల ద్వారానే వ్యాపిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఎస్ సుధాకర్, జీ. రవీంద్రారెడ్డి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● డాక్టర్ రామకృష్ణ, కోవూరుపల్లి పీహెచ్‌సీ

బిట్రగుంట, జూలై 12(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడం, అపరిశుభ్రత కారణంగా వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు వైద్య ఆరోగ్య సిబ్బంది గారమాల్లో పర్యటిస్తున్నారని కోవూరుపల్లి పీహెచ్‌సీ వైద్యుడు రామకృష్ణ తెలిపారు.

? సీజనల్ వ్యాధులు రాకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

! వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి వ్యాధులకు కారణమైన అపరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం.

? కోవూరుపల్లి పీహెచ్‌సీలో సిబ్బంది కొరత ఉందా.

! ఒక స్టాఫ్ నర్సు, డ్రైవర్ పోస్టు ఖాళీగా ఉన్నాయి. అంతకుమించి సిబ్బంది కొరత లేదు.

? ఏఆర్‌వీ (యాంటీ రాబిస్) వ్యాక్సిన్ అందుబాటులో ఉందా.

! కోవూరుపల్లి పీహెచ్‌సీలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. ఏ సమయంలోనైనా ఆరోగ్య సిబ్బంది వేస్తారు.

? మండలంలో ఎక్కువ శాతం రక్త హీనత ఉన్న వారి పట్ల ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! గిరిజన కాలనీల్లో మహిళల్లో రక్తహీనత ఎక్కువ శాతం ఉంది. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ద్వారా వారికి అవగాహన కల్పించడంతో పాటు మందులు సరఫరా చేస్తున్నాం. అంగన్వాడీలో అందచేస్తున్న పౌష్టికాహారం సక్రమంగా తీసుకునేలా చర్యలు చేపడుతున్నాం.

? పీహెచ్‌సీలో కాన్పులు చేసేందుకు వసతులు ఉన్నాయా.

! అనుభవం ఉన్న మహిళా వైద్యులు, సిబ్బంది ఉన్నారు. ఏ సమయంలోనైనా కాన్పులు చేసేందుకు వసతులు ఉన్నాయి.


ముగిసిన పవిత్ర ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

అనంతసాగరం జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాల వద్ద వెలసి ఉన్న ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో మూడు రోజులుగా జరుగుతున్న పవిత్ర ఉత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో అర్చక బృంధం హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఉభయకర్తలు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు.

వీడే మన వారసుడు సినిమా విజయవంతం కావాలి : ఎస్‌ఐ



ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో మాట్లాడుతున్న పట్టణ ఎస్‌ఐ శివనాగరాజు

కందుకూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవూరు గ్రామానికి చెందిన ఉప్పు రమేష్ నిర్మించిన సందేశాత్మక చిత్రం వీడే మన వారసుడు విజయవంతం కావాలని పట్టణ ఎస్‌ఐ శివనాగరాజు ఆకాంక్షించారు. ఈనెల 18న సినిమా విడుదలవుతున్న సందర్భంగా పట్టణంలోని ఆదిత్య గ్రాండ్ రెస్టారెంట్‌లో శనివారం ప్రీరిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటులు ఆనంద్‌భారతి, శర్వాణిమోహన్, కిషోర్, వెంకటేష్, రజని పాల్గొన్నారు.